గీత కులాలకు రెండు బార్లు

కడప క్రైం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కడప, ప్రొద్దుటూరులో గీత కులాలకు రెండు బార్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతిచ్చిందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్ తెలిపారు. కడప ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో బుధవారం సూపరింటెండెంట్ రవికుమార్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. ఈ నెల 29వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, 30న కలెక్టరేట్‌లో లాటరీ ద్వారా ఎంపిక చేస్తామని అన్నారు. కడప నగరంలో గౌడ్, ప్రొద్దుటూరు పట్టణంలో ఈడిగ కులాలకు కేటాయించామన్నారు. ఎంపికైన వారు రూ.27.50లక్షలు ఫీజు చెల్లించాలన్నారు.

పూర్ణాహుతితో ముగిసిన బాలాలయం



దేవుని కడపలో శాస్త్రోక్తంగా ముగిసిన బాలాలయ సంప్రోక్షణ

కడప కల్చరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల తొలిగడప దేవునికడప లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మూడురోజులుగా నిర్వహించిన బాలాలయం బుధవారం పూర్ణాహుతితో శాస్త్రోక్తంగా ముగిసింది. ఈ మేరకు ఉదయం 9.30 గంటలకు ఆలయంలో మహాపూర్ణాహుతి, 10 నుంచి 1.15గంల మధ్య తులాలగ్నంలో బాలబింబ ప్రతిష్ఠ, బాలాలయ సంప్రోక్షణ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో ప్రశాంతి, సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, పాటు అర్చకులు త్రివిక్రం, క్రిష్ణమూర్తి, తరుణ్, రఘునందన్, సాయి పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు 25న కౌన్సెలింగ్

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ఈనెల 25న బీఎఫ్ఏ (నాలుగు సంవత్సరాల డిగ్రీ) యానిమేషన్, అప్లైడ్ ఆర్ట్, పెయింటింగ్, ఫొటోగ్రఫీ, శిల్పం, ఇంటీరియర్ డిజైన్ కోర్సులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని వైస్ చాన్సలర్ డాక్టర్ విశ్వనాథ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. దరఖాస్తు చేసుకోని విద్యార్థులు సైతం డైరెక్ట్ అడ్మిషన్స్ కోసం ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు అయి అదేరోజు అడ్మిషన్ పొందవచ్చన్నారు. బీఎఫ్ఏ, బి.డిజైన్ కోర్సులకు రెండవ దశ కౌన్సెలింగ్ సెప్టెంబర్ 3న జరుగుతుందన్నారు.

గణేశ్ నిమజ్జనానికి పటిష్ఠ ఏర్పాట్లు



కుందూను పరిశీలిస్తున్న ఆర్డీవో, డీఎస్పీ

రాజుపాలెం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నిమజ్జనానికి పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, ప్రొద్దుటూరు డీఎస్పీ భావన సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం సాయంత్రం వెల్లాల, టంగుటూరు తదితర గ్రామాల వద్ద బ్రిడ్జిలను వారు పరిశీలించారు. సంబంధిత రెవెన్యూ, పోలీసు, విద్యుత్‌శాఖ అధికారులతో గణేశ్ నిమజ్జన ఏర్పాట్లపై ఆర్డీవో, డీఎస్పీ చర్చించారు. నిమజ్జనం రోజు తీసుకోవలసిన జాగ్రత్తలు, వంతెన వద్ద విద్యుత్ సౌకర్యం, బారికేడ్లు తదితర వాటిపై సమీక్షించారు. కార్యక్రమంలో రాజుపాలెం ఇన్‌చార్జి తహశీల్దారు గంగయ్య, ఎస్ఐ కత్తి వెంకటరమణ, ప్రొద్దుటూరు రూరల్ ఎస్ఐ అరుణ్‌రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టరు హుసేన్‌రెడ్డి పాల్గొన్నారు.

నలుగురు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల తొలగింపు

కలికిరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కడప, అన్నమయ్య జిల్లాల్లోని వివిధ కోర్టుల్లో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లుగా పనిచేస్తున్న నలుగురిని తొలగిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాయచోటి ఐదవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టులో ఏపీపీగా పనిచేస్తున్న టి.జగన్మోహన్‌రెడ్డి, మదనపల్లె ఏడవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి (ఫాస్ట్ ట్రాక్ కోర్టు) కోర్టులో ఉన్న వి.జయనారాయణరెడ్డి, కడప ఆరవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టు (ఫ్యామిలీ కోర్టు)లో పనిచేస్తున్న ఏపీపీ డి.ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కడప మహిళా, ఏడవ సెషన్స్ జడ్జి కోర్టులో ఏపీపీగా ఉన్న మొఘల్ యాస్మీన్‌బేగంను తొలగించారు. ఈ మేరకు రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ బుధవారం వేర్వేరుగా ఆదేశాలు జారీ చేశారు. అలాగే కడప పోక్సో ప్రత్యేక కోర్టులో ఒక పోక్సో కేసులో ప్రాసిక్యూషన్‌కు సహకరించడానికి కడప బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా ఉన్న డి.రెడ్డెయ్యను ప్రత్యేక కౌన్సిల్‌గా నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది.

అన్నిమండలాల్లో స్మార్ట్ కిచెన్లు

కడప కలెక్టరేట్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్లు అన్ని మండలాల్లో అమలులోకి రానున్నాయని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ భవన నిర్మాణాల గురించి బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే నగరంలో నిర్వహణలో ఉన్న స్మార్ట్ కిచెన్ రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. అదే స్ఫూర్తితో జిల్లాలోని అన్ని మండలాల్లో స్మార్ట్ కిచెన్ షెడ్లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ షెడ్ల నిర్మాణాలను ప్రారంభించిన 60 రోజుల్లో సివిల్ వర్క్ పూర్తిచేసి, మరో 15 రోజుల్లో అన్ని రకాల పరికరాలను ఏర్పాటుచేసి ట్రయల్ రన్ నిర్వహించాలన్నారు. ఈ ప్రక్రియ అంతా 90 రోజుల్లో పూర్తి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీవో హజరత్తయ్య, డీఈవో షంషుద్దీన్, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, హౌసింగ్ పీడీ రాజా రత్నం తదితరులు పాల్గొన్నారు.


ఆశాల హర్షం

● 180 రోజులు ప్రసూతి సెలవులు ● 62 ఏళ్ల వరకు ఉద్యోగ భద్రత

● ఇటీవల ప్రకటించిన చంద్రబాబు

● జిల్లాలో 1,588 మంది ఆశా వర్కర్లకు లబ్ధి





కడప కలెక్టరేట్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల వరాల జల్లు కురిపించారు. ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే విధంగా ఆశా వర్కర్లకు 6 నెలల పాటు ప్రసూతి సెలవులు కల్పించారు. అంతే కాకుండా ప్రసూతి సెలవులకు సంబంధించి 6 నెలల పాటు వేతనం అందించనున్నారు. గతంలో ఉన్న 60 ఏళ్ల సర్వీసును అంగన్వాడీలతో సమానంగా 62 ఏళ్ల వరకు పెంచారు. ఉద్యోగ విరమణ చేసిన తరువాత గ్రాట్యుటీ 1.50 లక్షలు ఇవ్వనున్నారు. ఆశా వర్కర్లకు ఈ వరాలన్నీ నాలుగురోజుల క్రితం చంద్రబాబు ప్రకటించారు. దీంతో జిల్లాలో 1,588 మంది ఆశా వర్కర్లకు లబ్ధి చేకూరనుండటంతో వీరు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గర్భిణులకు, పుట్టేబిడ్డకు రక్షణలో కీలకం

గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజల ఆరోగ్య విషయంలో ఆశా కార్యకర్తల పాత్ర కీలకం. జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం కింద గర్భిణీల ఆరోగ్యం నుంచి కాన్పు వరకు, పుట్టే బిడ్డకు ఐదేళ్లు వచ్చేంత వరకు ఆశాలు ఆరోగ్య రక్షకులుగా ఉంటారు. ఇంటింటా గర్భిణీల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోవడంతో పాటు, మలేరియా, డెంగ్యూ, గున్యా ఇతర అంటు వ్యాధుల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేస్తుంటారు. ప్రజల ఆరోగ్య పరిస్థితులకు సంబంధించి ఎప్పటికప్పుడు వైద్యసిబ్బందికి సమాచారం అందిస్తుంటారు. అయితే ప్రభుత్వాలెన్ని వచ్చినా వీరి కష్టాన్ని గుర్తించిన సందర్భాలు తక్కువే. చాలీ చాలని జీతాలతో అవస్థలు పడుతున్నారు.

టీడీపీ హయాంలోనే న్యాయం

గ్రామీణ ప్రాంతాల్లో రోజు వారీ కూలీకంటే తక్కువ వేతనాలతో ఆశా వర్కర్లు పనిచేస్తున్నారు. అలాంటి వారికి టీడీపీ హయాంలోనే కొంతమేర న్యాయం జరిగిందని చెప్పాలి. 2006 కాంగ్రెస్ పాలనలో కేవలం రూ.50 నెల వేతనంతో ఆశాలు పనిచేశారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1000లవరకు వేతనం పెంపు చేసింది. ఏళ్ల తరబడి జీతాలు, ఇతర హక్కుల కోసం పోరాటాలు చేసినప్పటికీ పెద్దగా ప్రయోజనాలు కల్పించలేదు. విభజిత రాష్ట్రానికి చంద్రబాబు ముఖ్యమంత్రిగా వచ్చాక 2018లో కేంద్రం ఇచ్చే వాటా రూ.3500లతో పాటు రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.5 వేలు కలపి రూ.8500 వరకు వేతనాలు అందించారు. వైసీపీ పాలనలో ఆశా వర్కర్ల వేతనం రూ.10 వేలు చేశారే కానీ ఇతర సౌకర్యాలేవీ కల్పించలేదు. తిరిగి చంద్రబాబు ప్రభుత్వం గత ఏడాది కొలువుదీరాక.. ఇటీవల వరాల జల్లు కురిపించడంతో ఆశాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయాల్లో అందించే భరోసానే వారికి ధైర్యాన్నిస్తోంది. తాజాగా కేంద్ర మంత్రి ప్రతాప్ ద్వివేదీ కూడా ఆశాలకు పెరుగుతున్న నిత్యావసరాలను దృష్టిలో పెట్టుకునే వేతనం పెంపు, సంక్షేమం తదితర అంశాలలో పార్లమెంటులో ప్రస్తావించారు. దీంతో భవిష్యత్తులో కూటమి ప్రభుత్వం తమను ఆదుకుంటుందని ఆశాలు ఆశతో ఉన్నారు.

సంక్షేమ పథకాలు వర్తింపచేయాలి



పెరుగుతున్న ధరలకు చాలీ చాలనీ వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పుడు కూటమి సర్కారు కొన్ని హామీలను అమలు చేసేందుకు ఒప్పుకుంది. ఇది ఆశాలకు కొండంత భరోసానిచ్చింది. అయితే రూ.10 వేల వేతనంతో రోజు వారీగా కుటుంబం నెట్టుకు రాలేకున్నాం. ప్రభుత్వం కల్పించే సంక్షేమ పథకాలు ఆశా వర్కర్ల కుటుంబాలకు వర్తింప చేయాలి.

- కల్పన,
ఆశావర్కర్ల సంఘం జనరల్ సెక్రటరీ

పనిఒత్తిడి తగ్గించాలి



కూటమి సర్కారు గ్రాట్యుటీ రూ.150 లక్షలు, 6 నెలల పాటు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వడంతో ఆశాల్లో మరింత సంతోషం కల్గింది. రోజు వారీ ఇంటింటా విజిట్, గర్భిణీలు, చిన్న పిల్లలకు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయడంలో ఇబ్బందులు తప్పడం లేదు. ఆశాలకు పని ఒత్తిడి తగ్గించాలి.

- మరియమ్మ, ఆశా వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు

చంద్రబాబు చొరవ హర్షణీయం



ఎన్నికల హామీల్లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపడం హర్షణీయం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెర వేర్చాలి. కనీస వేతనం రూ.26 వేలకు పెంచితే మా కుటుంబ జీవనం మెరుగు పడుతుంది. కూటమి సర్కారు ప్రస్తుతం ఆశాలకు ఇవ్వనున్న ఆర్థిక వెసులుబాటుకు సంబంధించిన జీవోను వెంటనే విడుదల చేయాలి.

- సుభాషిణి,
ఆశా వర్కర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు

ప్రజలకు అందుబాటులో ఉండండి

● టీడీపీ నేతలతో చంద్రబాబు



పులివెందుల జడ్పీటీసీగా ఎన్నికైన లతారెడ్డిని సన్మానిస్తున్న చంద్రబాబు చిత్రంలో మంత్రి సవిత, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, పులివెందుల ఇన్‌చార్జి బీటెక్ రవి తదితరులు

కడప, ఆగస్టు 20(ఆంధ్రజ్యో తి): కూటమి పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని, అహంకారి వీడి ప్రజలకు అందుబాటులో ఉండాలని, సౌమ్యంగా వ్యవహరించి మంచిపేరు తెచ్చుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. బుధవారం రాత్రి టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు పుత్తా చైతన్యరెడ్డి, ఆదినారాయణరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, జమ్మలమడుగు ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, బద్వేలు ఇన్‌చార్జి రితీశ్‌రెడ్డి, నంద్యాల కొండారెడ్డి, జడ్పీటీసీ సభ్యులు మారెడ్డి లతారెడ్డి, ముద్దుక్రిష్ణారెడ్డి, మంత్రులు సవిత, బీసీ జనార్దన్‌రెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి తదితర ఉమ్మడి కడప జిల్లా నేతలతో చంద్రబాబు అమరావతిలో సమావేశం అయ్యారు. ఒంటిమిట్ట, పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో గెలుపొందిన క్రిష్ణారెడ్డి, లతారెడ్డిని చంద్రబాబు అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేటి ఉప ఎన్నికల గెలుపు రాబోయే ఎన్నికలకు తొలిఅడుగు అన్నారు. నేతలు కార్యకర్తలు కలిసి పనిచేసి పార్టీకి విజయాన్ని చేకూర్చారన్నారు. పులివెందుల్లో అద్భుతంగా పనిచేసి విజయం సాధించారని ఇది ప్రజాస్వామ్య విజయమన్నారు. పులివెందులలో వైసీపీపై స్థానిక ప్రజలు విసుగు చెందారని, మీరు కష్టపడి పనిచేసి డీ అంటే డీ అందాం.. ప్రజాస్వామ్యయుతంగా ఉందామన్నారు. గతంలో ఎమ్మెల్సీ గెలిచాం, మరలా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ గెలిశాం, ఇప్పుడు జడ్పీటీసీ గెలిచామన్నారు. వైసీపీ అరాచకం, రౌడీయిజంతో ఓడిందన్నారు. కాగా కొన్ని చోట్ల నేతల తీరుతో పార్టీకి చెడ్డపేరు వస్తోందని ఇలాంటి వాటిని సహించబోమని హెచ్చరించారు. రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా చమర్తి జగన్‌మోహనరాజును ప్రకటించారు.

బానిసత్వం భరించలేకనే బీజేపీకి బైబై

● సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి



పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి

కడప మారుతీనగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అభ్యున్నతి కోసం 12 సంవత్సరాలుగా సేవలందిస్తున్నా తన వాణి వినిపించే అవకాశం కూడా లేకుండా పోయిందని, ఆ బానిసత్వం భరించలేక బీజేపీకి బై బై చెబుతున్నా అని కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు కమిటీ కన్వీనర్ సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం కడపలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ రెండు వర్గాలుగా విడిపోయిందని ఒక వర్గం ఒక పార్టీకి, మరో వర్గం మరోపార్టీకి వంతపాడుతూ బీజేపీకి నష్టం కలిగిస్తోందన్నారు. దీంతో కొత్తగా బీజేపీలో చేరిన యువత తిరిగి అంతే వేగంగా వెనక్కి వెళ్లిపోతున్నారన్నారు. ఇన్ని సంవత్సరాల్లో ఏ రోజు కూడా బీజేపీ రాష్ట్రంలో బలపడాలని, అధికారంలోకి రావాలనే కాంక్షతో పార్టీ నాయకులు ఆలోచించలేదన్నారు. కేవలం ఉనికి కోసం పాకులాడుతూ అధికార పార్టీ నాయకత్వానికి సహకారం అందించడమే తప్ప మరో ఆలోచన లేదన్నారు. ఇదిలా ఉండగా రాష్ట్రంలోని ప్రధాన సమస్యల్లో ఒకటైన మ్యాంగో బోర్డు ఉద్యమాన్ని లేవనెత్తేందుకు తాను సిద్ధపడినా కొంతమంది నాయకులు వద్దంటూ తన గొంతుకను కట్టడి చేశారన్నారు. ఎప్పటికైనా రాయలసీమకు పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి రాకపోతుందా అని ఆశగా ఎదురు చూశానని, ఒకవేళ వచ్చి ఉంటే పెండింగులో ఉన్న ప్రాజెక్టులు పూర్తిచేయాలని అనుకున్నానన్నారు. కానీ ఆ ఆశ నెరవేరలేదన్నారు. ఇంతవరకు రాయలసీమ జిల్లాలకు రాష్ట్ర అధ్యక్ష పదవి కానీ, జనరల్ సెక్రటరీ పదవి కానీ ఇవ్వలేదన్నారు. ఈ బానిస బతుకులు బతకలేకనే బీజేపీ సాధారణ సభ్యత్వానికి, క్రియాశీలక సభ్యత్వానికి, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు కమిటీ కన్వీనర్ పదవికి తాను రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు.

పీ4 పిచ్చిలో చంద్రబాబు

● మాజీ మంత్రి డీఎల్



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి

ఖాజీపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి పీ4 పిచ్చిలో ఉన్నారని ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి అన్నారు. బుధవారం మాజీ మంత్రి డీఎల్ ఖాజీపేటలోని స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ వాట్సాప్ గవర్నెన్స్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను ప్రభుత్వం తీసుకొచ్చిందని, అయినా రెవెన్యూ కార్యాలయాల్లో లంచాలు లక్షల్లో అడుగుతున్నారని అన్నారు. జిల్లాలో కస్తూరిబా స్కూళ్లలో 44 మంది ఔట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్నారని, వారికి ఇప్పటికి జీతాలు ఇచ్చేందుకు మంత్రి సంతకం పెట్టడంలేదని అన్నారు. ఎమ్మెల్యేలు సంతకాలు పెట్టకపోవడంతో జీతాలు రావడం లేదని కొందరు అంటున్నారని అన్నారు. ఇప్పటి వరకు మన రాష్ట్రంలో కొత్త పింఛన్లు, కొత్త గృహాలు ఇవ్వలేదన్నారు. గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు తేడా ఏముందని ప్రశ్నించారు. నిజమైన వికలాంగులకు పింఛన్లు తీసి కొంతమంది చెంచాలు లాలూచీపడి అనర్హులకు ఇప్పించడంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందన్నారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ప్రతి పల్లె తిరిగి సమస్యలను గుర్తించి పరిష్కరించగలిగితే శాశ్వత శాసనసభ్యులుగా ఉంటారని అన్నారు. వైసీపీలో చెలామణి అయిన వారిని అధికార పార్టీలో చేర్చుకోవడం మంచిపద్ధతి కాదన్నారు.

కాజేశారు..

● మైనార్టీ సంక్షేమశాఖలో రూ.2.48 కోట్లు స్వాహా

● కుటుంబ సభ్యుల పేరిట డ్రా చేసిన వైనం

● ఇద్దరిపై క్రిమినల్ కేసులు నమోదు



(కడప-ఆంధ్రజ్యోతి): అది.. సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న సమయం. జిల్లా యంత్రాంగమంతా ఎన్నికల నిర్వహణలో నిమగ్నమైంది. ప్రశాంత ఎన్నికల కోసం ఎవరికి కేటాయించిన విధులు వారు చూసుకుంటూ క్షణం ఊపిరి సలపకుండా పనిచేస్తున్న సమయం. కలెక్టరు నుంచి ప్రధాన శాఖల అధికారులంతా ఎన్నికల హడావుడిలో ఉన్నారు. అయితే ఈ సమయాన్ని ఇద్దరు అవినీతి అధికారులు బాగా వాడుకున్నారు. అందరూ ఎన్నికల హడావుడిలో ఉన్న సమయంలో.. మైనార్టీ సంక్షేమశాఖలో ఉన్న రూ.2,48,67,736ల ప్రభుత్వ ధనాన్ని సొంత డబ్బులా భావించి కుటుంబ సభ్యుల పేరిట డ్రా చేశారు. ఈ విషయం ఇటీవల బయటికి రావడంతో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశాల మేరకు ఆ ఇద్దరిపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. మైనార్టీ సంక్షేమం శాఖలో మైనార్టీలకు సంబంధించి వివిధ పథకాలను ప్రభుత్వాలు అమలు చేస్తుంటాయి. ఇందులో భాగంగా మసీదులు, చర్చిల నిర్మాణాల కోసం నిధులు మంజూరయ్యాయి. మైనార్టీ అధికారిగా షేక్ ఇమ్రాన్‌ఖాన్, జూనియర్ అసిస్టెంటుగా మస్తాన్‌వలి పనిచేస్తున్నారు. జిల్లాలో చర్చిలు, మసీదుల నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. బిల్లుల చెల్లింపు పోను ఇంకా ఆ ఖాతాలో డబ్బులు ఉండేవి.

కుటుంబ సభ్యుల పేరుతో..

మైనార్టీశాఖ సంక్షేమశాఖ ఖజానాలో ఉన్న ప్రభుత్వ నిధులపై ఇమ్రాన్‌ఖాన్ కన్నేశారు. అధికార యంత్రాంగమంతా ఎన్నికల హడావుడిలో ఉంది. ఇప్పుడు డబ్బులు కాజేసినా ఎవరూ పట్టించుకోరన్న ధైర్యంతో ఆ ఖాతాలోని డబ్బులను రూ.2,48,67,736ల డబ్బులు 2024 మార్చి 16 నుంచి కుటుంబ సభ్యుల పేరిట చెక్కు ద్వారా డ్రా చేశారు. దీనికి జూనియర్ అసిస్టెంటు మస్తాన్‌వలి సహకరించారు. అప్పటికే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది. మరలా ఎన్నికల్లో ప్రభుత్వం వస్తుంది, కొత్త ప్రభుత్వం ఈ డబ్బుల గురించి పట్టించుకోదనే ధైర్యంతో కాజేశారు. కాగా.. ఆ శాఖ ఇటీవల బ్యాంకు ఖాతాలను మార్చే సమయంలో డబ్బులు కాజేసినట్లు అర్థమైంది. ఈ నిధుల వ్యవహారం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆయన జాయింట్ కలెక్టరు అదితిసింగ్‌తో విచారణ జరిపించారు. నిధులు స్వాహా అయినట్లు జేసీ నివేదిక ఇచ్చారు. దీంతో ఆ ఇద్దరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయమని ఆదేశించడంతో మైనార్టీ అధికారి హిదయతుల్లా ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసుస్టేషనులో కేసు నమోదైంది. వైసీపీ హయాంలో ఇమ్రాన్‌ఖాన్ మైనార్టీ అధికారిగా జాయిన్ అయ్యారు. ఈయన పలు అక్రమాలకు పాల్పడినట్లు ఫిర్యాదులున్నాయి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చినా కొందరిని మేనేజ్ చేసుకుంటూ ఆ కుర్చీలో కొనసాగుతూ వచ్చారు. ఇప్పుడు విచారణతో ఈయన బండారం బట్టబయలైంది.

మిస్సింగ్ కేసులను త్వరగా ఛేదించాలి

● వినాయక చవితి ఉత్సవాలకు పటిష్ఠ భద్రత చేపట్టాలి

● నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ అశోక్‌కుమార్



నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్, చిత్రంలో ఏఎస్పీ ప్రకాశ్‌బాబు

కడప క్రైం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మిస్సింగ్ కేసులపై ప్రత్యేకదృష్టి పెట్టి త్వరితగతిన ఛేదించాలని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక పెన్నార్ కాన్ఫరెన్స్ హాలులో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ మిస్సింగ్ కేసులకై ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. వినాయక చవితి పండుగ నేపథ్యంలో పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. మహిళలు, బాలికలపై నేరాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. శక్తియాప్ వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. కళాశాలలు, పాఠశాలల వద్ద శక్తిటీంల ద్వారా ఈవ్‌టీజింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రోన్ కెమెరా ద్వారా నిఘా ఉంచాలని ఆదేశించారు. క్రికెట్, బెట్టింగ్, గ్యాంబ్లింగ్, మట్కా ఎక్కడా జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ క్రైం, సోషల్ మీడియా కేసుల్లో నిందితులను అరెస్టు చేసేందుకు ప్రత్యేక పోలీసు టీమ్స్ ఏర్పాటు చేయాలన్నారు. బైకులపై ఓవర్ స్పీడ్, సైలెన్సర్ మార్చి తిరిగే వారు, ప్రమాదకర స్టంట్స్ చేసే ఆకతాయిలపై చట్టపరంగా చర్యలు తీసుకోలన్నారు. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాల్లో కార్డన్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ (పరిపాలన) ప్రకాశ్‌బాబు, డీఎస్పీలు, జిల్లాలోని సీఐలు, కడప సబ్‌డివిజను పరిధిలోని ఎస్ఐలు పాల్గొన్నారు.

పలువురికి ప్రశంసలు

పనితీరులో ప్రతిభ చూపినందుకు అదనపు ఎస్పీ ప్రకాశ్‌బాబుతో పాటు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందించారు. ఏఎస్పీలు ప్రకాశ్‌బాబు (పరిపాలన), బి.రమణయ్య (ఏఆర్)తో పాటు డీఎస్పీలు ఎన్.సుధాకర్ (స్పెషల్ బ్రాంచ్), వెంకటేశ్వర్లు (కడప), బి.మురళి (పులివెందుల), భావన (ప్రొద్దుటూరు), రాజేంద్రప్రసాద్ (మైదుకూరు), వెంకటేశ్వర్‌రావు (జమ్మలమడుగు), బాలస్వామిరెడ్డి (మహిళా పీఎస్), ఎస్ఏ అబ్దుల్‌కరీం (డీటీసీ), కె.శ్రీనివాసరావు (ఏఆర్, కడప) ప్రశంసాపత్రాలు అందుకున్నారు. అలాగే సీఐలు వినయ్‌కుమార్‌రెడ్డి, డీఎం రియాజ్‌అహ్మద్, ఈశ్వర్‌రెడ్డి.. ఎస్ఐలు మధుసూధన్‌రెడ్డి, రాజరాజేశ్వర్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ ఖాదర్‌హుసేన్, కానిస్టేబుళ్లు ఎస్కే బాషా, బి.శ్రీనివాస్, ఆర్వీ పెరుమాళ్లు, ఎం.సుబ్బరాయుడు, సి.కొండయ్య, ఏఎస్ కీర్తి సైతం ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

ప్రమాదవశాత్తు నీటిలో పడి వ్యక్తి మృతి

● మెట్టసోంపల్లెలో విషాదఛాయలు



అవుల శంకర (ఫైల్ ఫొటో)

పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఓ గొర్రెల కాపరి ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడి మృతిచెందిన విషాదకర సంఘటన మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు అందించిన వివరాల మేరకు.. దేవప్పకోట పంచాయతీ మెట్ట సోంపల్లెకు చెందిన అవుల రామప్ప కుమారుడు అవుల శంకర (55) సోమవారం గొర్రెలను మేపుకునేందుకు మెట్టసోంపల్లె గ్రామ శివారులో ఉన్న ఏటి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి ఏటిలో పడిపోయాడు. పక్కనే గొర్రెలను మేపుకుంటున్న మహిళలు గమనించి స్థానికులకు సమాచారం అందించారు. హుటా హుటిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అక్కడికి చేరుకుని పీటీఎం పోలీసులకు తెలియజేశారు. ఎస్ఐ హరిహరప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్థుల సహాయంతో ఏటిలో గాలించారు. సాయంత్రం 7గంటలకు బయటకు వెలికితీయగా, శంకర అప్పటికే మృతిచెందాడు. ఎస్ఐ కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు. బుధవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తన స్వగ్రామమైన మెట్టసోంపల్లెకు తరలించారు. శంకర మృతితో విషాదచాయలు అలు ముకున్నాయి. మృతుడికి భార్య రమణమ్మ, కుమారుడు మల్లిఖార్జున ఉన్నారు.

రెండురోజుల జాతీయస్థాయి శిక్షణ



సర్టిఫికెట్ అందుకుంటున్న శివనారాయణగౌడ్

చిట్వేలి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని నరేంద్రమోదీ ఆదేశాల మేరకు శాస్త్రీయ పారిశ్రామిక పరిశోధన మండలి (సీఎస్ఐఆర్) వారు జిగ్యాస కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా 30 మంది ఉపాధ్యా యులు, శాస్త్రవేత్తలు ముఖాముఖి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా చిట్వేలి జడ్పీ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు ఎ.శివనారా యణగౌడ్ బెంగుళూరులోని జాతీయ వైమానిక అంతరిక్ష ప్రయోగ శాలలో ఏరోడైనమిక్స్, విమాన విడిభాగాలు, నానో మెటీరియల్స్ పైన 2 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసి సంస్థ డైరెక్టర్ జిగ్యాస మోడల్ అధికారి డాక్టర్ వీపీఎస్ నాయుడు ద్వారా సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యా యుడు దుర్గరాజు, ఉపాధ్యాయ సిబ్బంది శివనారాయణగౌడ్‌ను అభినందించారు.

లేగ దూడల సంరక్షణపై శ్రద్ధ చూపాలి

● డీఏహెచ్ఓ గుణశేఖర్



దూడల ప్రదర్శనలో గుణశేఖర్, పాడిరైతులు

కలకడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): లేగ దూడల సంరక్షణపై పాడి రైతులు శ్రద్ధ చూపాలని డీఏ హెచ్‌వో గుణశేఖర్ అన్నారు. మండలంలోని నడిమిచెర్లలో బుధవారం నిర్వ హించిన మేలుజాతి దూడల ప్రదర్శనలో ఆయన మాట్లాడుతూ పశుపోషణను ఎంచుకొని జీవనాధారం సాగించే రైతులు నికరాదాయాన్ని పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా పశుసంవర్థకశాఖ పథకాలైన పశుబీమా, లింగ నిర్ధారణ వీర్యం, పశుగ్రాస విత్తనాలు, తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ అవకాశాన్ని అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రదర్శనకు వచ్చిన 52 లేగ దూడల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఎంపికైన దూడల యాజమానులు నాగేంద్రరెడ్డి, నిరంజన్, రెడ్డిశేఖర్‌రెడ్డిలకు బహుమతులు అందజేశారు. పశుపోషకులకు మినరల్ మిక్చర్, మందులను పంపిణీ చేశారు. అధికారులు సుబ్బారావు, శశికళ, పూర్ణిమ, తేజకల్యాణ్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల తొలగింపు

రాయచోటి (నేతాజీసర్కిల్), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): చెత్త సేకరణ చేయకుండా, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న నలుగురు పంచాయతీ కార్యదర్శులను కలెక్టర్ తాత్కాలికంగా తొలగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ తెలి పారు. రామాపురం మండలం నల్లగుట్టపల్లె పంచాయతీ కార్యదర్శి పి.ఓబులమ్మ, గాలివీడు మండలం నూలివీడు గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులునాయక్, వీరబల్లి మండలం ఓదివీడు గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.రహిమాన్, చిన్నమండెం పడమటికోన గ్రామ పంచాయతీ కార్యదర్శి టి.జమీర్‌హుసేన్‌లను తాత్కాలికంగా విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు.

హత్యకేసులో ఇద్దరు నిందితులు అదుపులోకి

మదనపల్లెఅర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సీటీఎం గ్రామం, రైల్వేస్టేషన్ సమీపంలో బ్రిడ్జ్ వద్ద అనుమానాస్పద కేసులో పశ్చిమబెంగాల్‌కు చెందిన ఖదీర్ మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా కదిరి రైల్వే పోలీసులు ఈ కేసులో దర్యాప్తు ముమ్మరం చేసి హత్య చేసిన నిందితులను ఇద్దరిని గుర్తించి అదుపులోకి తీసుకొన్నట్లు విశ్వసనీయ సమాచారం. వీరిని కదిరి రైల్వే పోలీసుస్టేషన్ తరలించి నట్లు తెలిసింది.

80 ఏళ్లుగా మట్టిరోడ్లే గతి

● పట్టించుకోని పాలకులు
● వర్షం వస్తే నరకమే..
● ఇబ్బందుల్లో వృద్ధులు, విద్యార్థులు
● ఎన్నికల హామీలు ఏమయ్యాయి ?



మొరవపల్లెకు వెళ్లే హంద్రీనీవా కాలువగట్టు రహదారి

పీలేరురూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు పూర్తయి 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా జరుపుకున్నాం. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేల కోట్లు వ్యయం చేస్తున్నాయి. ఎన్నికల సందర్భంగా వివిధ పార్టీల నేతలు అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి ప్రాధాన్యతగా మీఊరి రోడ్డు వేయిస్తామని లెక్కలేనన్ని సార్లు హామీలు గుప్పించారు తప్ప అవి ఆచరణకు నోచుకోవడం లేదు. దీంతో నేటికీ పలు గ్రామాలు రహదారి వసతికి నోచుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎవరు అధికారంలోకి వచ్చినా తమ గతి ఇంతేనంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇక వర్షం వస్తే ఎంత అత్యవసరమైనా ఊరు నుంచి బయట ప్రాంతాలకు వెళ్లాలంటే గగనమే. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ నాలుగు గ్రామాలు నేటికీ రహదారి వసతికి నోచుకోకపోవడం శోచనీయం. నిత్యం రైతులు, మహిళలు, విద్యార్థులు, వృద్ధులు పడుతున్న ఇక్కట్లు వర్ణనాతీతం. తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక సమస్యల సంద్రంలో బతుకు బండి లాక్కొస్తున్నారు.

పీలేరు మండలం జాండ్ల పంచాయతీ పరిధిలోని గుట్టకిందల్లె, ఎస్టీ కాలనీ, గుట్టకిందపల్లె, హరిజనవాడలో సుమారు 120 కుంటుంబాలు జీవిస్తున్నారు. పీలేరు-తలపుల రహదారి మార్గం లోని బసిరెడ్డిగారిపల్లె క్రాస్ నుంచి ఎస్టీ కాలనీ మీదుగా హరిజనవాడకు నాలుగు కి.మీ. మట్టిరోడ్డు ఉంది. అలాగే బాలంవారిపల్లె పంచాయతీ పరిధి లోని నాలేవాండ్లపల్లె కాలనీ నుంచి మొరవపల్లె మీదుగా అక్కిసేనువారిపల్లె, చిచ్చిలవారిపల్లె వరకు 4 కి.మీ. మట్టిరోడ్డే గతి. ఇరు పంచాయతీల్లో రహదారి వేయాలని ఐదేళ్లకోసారి ఓట్ల కోసం వచ్చే ప్రముఖ రాజకీయ పార్టీ నేతల దృష్టికి తేవడం, అధికారంలోకి వచ్చిన వెంటనే అటకెక్కడం పరిపాటిగా మారింది. నాలేవాండ్లపల్లె కాలనీ నుంచి మొరవపల్లెకు రెండు కి.మీ. హంద్రీనీవా కాలువ గట్టుపైనే వెళ్లాల్సిన దుస్థితి. ఇక్కడ 45 కుటుంబాలు నివసిస్తున్నారు. రాత్రి వేళల్లో వెళ్లాలంటే బిక్కుబిక్కు మంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిందే. వర్షం వస్తే ఈ గ్రామాల ప్రజలు పడే ఇక్కట్లు వర్ణణాతీతం. దారి పొడవునా బురద, గుంతల మయై రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారు తుంది. కనీసం ఆటో రమన్నా వచ్చే పరిస్థితి లేదు. నిత్యం ఈ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు నడుచుకొని రావాల్సిందే. ఇక రైతులు, వృద్ధులు, మహిళల, రోగుల పరిస్థితి చెప్పనక్కరలేదు. దశాబ్దాలు గడుస్తున్నా రహదారి వసతికి నోచుకోక పోవడం శోచనీయం.



గులకరాళ్లు, గుంతలమయమైన గుట్టకిందపల్లె రహదారి

ఆటో వెళితే నాలుగు పంక్చర్లు



పీలేరు నుంచి గుట్టకిందపల్లెకు ఒక్కసారి వెళ్లొస్తే ఆటోకు నాలుగు పంక్చర్లు వేయాలి. ఇచ్చే బాడుగ కన్నా పంక్చర్లకు అయ్యే ఖర్చే ఎక్కువ. దారి పొడవునా గులకరాళ్లు, గుంతలమయం. పలు మార్లు అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లినా అదిగో ఇదిగో అంటున్నారు తప్ప రోడ్డు వేసిన దాఖలాలు లేవు. ఇక ఎంతకాలం ఈ ఇక్కట్లు.

- బి.నాగరత్నంనాయక్, ఎస్టీ కాలనీ, పీలేరు మండలం

రెండు కిలోమీటర్లు నడవాలి



మా బిడ్డలు బడికి వెళ్లాలంటే రెండు కి.మీ. నడిచి వెళ్లాలి. రోడ్డు వేయనందున తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఓట్ల కోసం వచ్చే నాయకులు అదిగో ఇదిగో అంటున్నారు తప్ప రోడ్డు వేసిన పాపాన పోలేదు. ఎన్నో ఏళ్ల నుంచి అడుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. అంతా కూలీ నాలి చేసుకొని బతుకుతున్నాం. ఎప్పుడేస్తారో ఏమో.

- సుప్రియ, మొరవపల్లె, పీలేరు మండలం

ఎవరూ పట్టించుకోవడం లేదు



రోడ్డు వేయాలని చాలా ఏళ్లగా అడుగు తున్నాం. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎన్నికలు అయిన వెంటనే వేయిస్తాం అంటున్నారు తప్ప వేసింది లేదు. ఊరు నుంచి పీలేరుకు వెళ్లాలంటే చాలా కష్టం. 1983 నుంచి ఇక్కడే ఉన్నాం. హంద్రీనీవా కాలువ గట్టే దారి. అధికారులు ఎవరూ మాఊరికి రావడం లేదు.

- రమణయ్య, మొరవపల్లె, పీలేరు మండలం

15 మంది వీఆర్వోల డిప్యుటేషన్లు

కలికిరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గతంలో జిల్లాలో రెండు దఫాలుగా జరిగిన వీఆర్వోల బదిలీలు వివాదాస్పదంగా మారిన నేపథ్యంలో బుధవారం మరో విడత 15 మంది వీఆర్వోలను డిప్యుటేషన్లపై వివిధ మండలాలకు నియమిస్తూ జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. జూలై 26న 45 మంది వీఆర్వోలను, అనంతరం ఆగస్టు 4న మరో 34 మంది గ్రేడ్-2 వీఆర్వోలను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టరు ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. వీటిపై వివాదాలు తీవ్ర స్థాయిలో కొనసాగుతుండగా బుధవారం మరో 15 మందిని డిప్యుటేషన్లపై బదిలీలు చేశారు. ఈ సారి జిల్లా రెవెన్యూ అధికారి కె.మధుసూదన రావు ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. గతంలో బదిలీ అయిన వారిలో కొంతమందిని తిరిగి యధాతథంగా పూర్వ స్థానాలకు డిప్యుటేషన్లపై నియమించగా మరి కొంతమంది కూడా అక్కడికక్కడే సర్దుబాటు చేసే ప్రయత్నాలు చేశారు. మర్రికుంటపల్లె నుంచి గతంలో అంకిశెట్టిపల్లెకు బదిలీ అయిన సురేష్‌కుమార్‌రెడ్డిని తిరిగి మర్రికుంటపల్లెకు నియమించారు. కోళ్లబయలు నుంచి మర్రికుంటపల్లెకు గతంలో బదిలీ అయిన జి.శివశంకర్‌ను కురబలకోట మండలం ముదివేడు-1కు పంపారు. మదనపల్లె మండలం కోటావారిపల్లె నుంచి మాధవరెడ్డిని గతంలో వాల్మీకిపురం మండలం జర్రావారిపల్లెకు బదిలీ చేశారు. ఆయనను తాజాగా పీటీఎం మండలం టి.సదుంకు డిప్యుటేషన్‌పై నియమించారు. నిమ్మనపల్లె మండలం వెంగంవారిపల్లె నుంచి ఎం.ప్రవీణ్‌కుమార్‌ను మదనపల్లె బీకే పల్లెకు నియమించారు. గతంలో ఈయనను ఇదే బీకేపల్లె నుంచి వెంగంవారిపల్లెకు బదిలీ చేశారు. ఇదే విధంగా గతంలో బదిలీ అయిన పలువురు వీఆర్వోలను తాజాగా తిరిగి వేరే మండలాల్లో నియమించారు. ఇలా డిప్యుటేషన్లపై కె.దొరస్వామి నడిమిచెర్ల (కలకడ) నుంచి ముసలికుంట (పెద్దమండెం), ప్రవీణ్‌కుమార్‌రెడ్డి గ్రేడ్-1ను మదనపల్లె బీకే పల్లెకు, బుక్యామునిస్వామి నాయక్‌ను కోటావారిపల్లె నుంచి అమిలేపల్లె (గుర్రంకొండ), టి.భాగ్యలక్ష్మిని గుర్రంకొండ-2 నుంచి ముదివేడు-2 (కురబలకోట), గుమ్మసముద్రం (బి.కొత్తకోట) నుంచి జి.నరేంద్రబాబును కొత్తపల్లె-2 (మదనపల్లె), ముదివేడు-2 నుంచి ఎస్.ప్రతిమను గుర్రంకొండ-3, ముద్రపల్లె (పెనగలూరు) నుంచి ఎస్.స్వాతిని సి.కందులవారిపల్లె (చిట్వేలి), అక్కడున్న కె.నాగేంద్రకుమారిని ముద్రపల్లెకు, ఎ.గౌస్‌ఫకుర్వాల్లీని ముసలికుంట (పెద్దమండెం) నుంచి మట్లివారిపల్లె (కురబలకోట)కు, పెద్దకారంపల్లె (రాజంపేట) నుంచి అప్పరాజుపేటకు, నల్లతిమ్మాయపల్లె (నందలూరు) నుంచి ఎం.వి.వెంకటరమణను పెద్దకారంపల్లెకు డిప్యుటేషన్‌పై నియమించారు.

తిరుపతిలో 'అమరావతి చాంపియన్ షిప్'

● 24, 25, 26వ తేదీల్లో నిర్వహణ

అమరావతి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో "అమరా వతి చాంపియన్ షిప్-2025" పేరుతో రాష్ట్రస్థాయి క్రీడా పోటీ లను నిర్వహిస్తున్నామని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. ఈ నెల 29న జరగనున్న నేషనల్ స్పోర్ట్స్ డేలో భాగంగా రాష్ట్రస్థాయి పోటీలకు తిరుపతి ఆతిథ్యమిస్తుందని బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 24, 25, 26వ తేదీల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా పోటీలు నిర్వహిస్తు న్నట్టు వివరించారు. రాష్ట్రస్థాయిలో హాకీ, బ్యాడ్మింటన్, వాలీ బాల్, బాస్కెట్ బాల్, ఖోఖో, కబడ్డీ, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్, ఆర్చరీ పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ పోటీల్లో రెండు వేల మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 29న విశాఖపట్నంలో జరిగే నేష నల్ స్పోర్ట్స్ డేకు సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొం టారని చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీల విజేతలకు నగదు ప్రోత్సా హకాలు, పతకాలు అందజేస్తారని రవినాయుడు స్పష్టం చేశారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఉద్యానశాఖ అధికారి ఈశ్వర్‌రెడ్డి



రైతులకు వివరిస్తున్న ఉద్యానవన శాఖ అధికారి ఈశ్వర్‌రెడ్డి తదితరులు

నిమ్మనపల్లి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండల రైతులు ఉద్యానశాఖ ద్వారా అందుబాటులో వున్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి ఈశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వెంగంవారిపల్లి పంచాయతీలోని రైతులకు మామిడికాయలు కోసిన అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మామిడి, అల్లనేరేడు, దానిమ్మ, జామ, వంటి పండ్లతోటల పెంపకానికి ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ రైతులకు పూల మొక్కలు, కూరగాయల వంటి పంటలు వేసిన రైతులకు మల్చింగ్ పేపర్‌లను సబ్సిడీతో రూ.8వేలకే సరఫరా చేస్తునట్లు తెలిపారు. అదే విధంగా నీటి నిల్వకుంటలకు 50 శాతం అనగా రూ.75 వేలను సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. పాలిహౌస్, షేడ్‌నెట్ హౌస్‌లను నిర్మించుకొనే వారికి 50శాతం రాయితీ లభిస్తుందని తెలిపారు. అనంతరం కలికిరి కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసులు మాట్లాడుతూ మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలని, వాటిలో కొత్తచెట్టు నాటే రైతులు ట్రైనింగ్, ప్రూఫింగ్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలి

● కడప కలెక్టర్‌కు రాజంపేట నేతల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న రాజంపేట నేతలు

రాజంపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాజం పేటను జిల్లా కేంద్రం చేయాలంటూ కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు రాజంపేట నేతలు విజ్ఞప్తి చేస్తూ విజ్ఞాపన పత్రాలను అందజేశారు. రాజంపేట పట్టణానికి చెందిన వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ అందుకు సంబంధించిన సుమారు 20 వినతిపత్రాలను కలెక్టర్‌కు అందజేశారు. సుమారు 105 సంవ త్సరాలుగా సబ్‌కలెక్టర్ కేంద్రంగా, పార్లమెంటరీ నియోజకవర్గం కేంద్రంగా, అన్నమయ్య జన్మ స్థలిగా అన్ని అర్హతలున్న రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా అతి సమీపంలోని తిరుపతి, కడప విమానా శ్రయాలు, ప్రధాన ముంబై-చెన్నై హైవేరోడ్డు, జిల్లా కేంద్రానికి కావాల్సిన అన్ని వనరులు రాజంపేటలో ఉన్నాయని పేర్కొన్నారు. గతంలో కాశినాయన, బ్రహ్మంగారిమఠం, బద్వేల్, రాజంపేట, కోడూరుకు చెందిన 17 మండ లాలు రాజంపేట డివిజన్‌లో ఉండేవన్నారు. అటువంటి డివిజన్‌లో గత జగన్ ప్రభుత్వం కుదించి ఈ ప్రాంతాన్ని గుర్తింపులేకుండా చేసి జిల్లా కేంద్రం కాకుండా చేశారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఏర్పడిన జిల్లాలకు సంబంధించిన నూతన మంత్రివర్గపు ఉపసంఘం తమ ప్రాంత మనోభావాలను గుర్తించి రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని విజ్ఞప్తి చేస్తూ విజ్ఞాపన పత్రాలను అందజే శారు. ఈ కార్యక్రమంలో రాజంపేట జిల్లా సాధన సమితి కన్వీనర్ టి.లక్ష్మీ నారాయణ, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, మాజీ అధ్యక్షుడు వెంక టేశ్వర్లునాయుడు, ప్రైవేటు కళాశాలల అసోసియేషన్ నాయకుడు ప్రభాకర్‌నాయుడు, డిగ్రీ కళాశాలల జిల్లా అసోసియేషన్ అధ్య క్షుడు గీతాంజలి రమణ, వైద్య సంఘం నాయ కుడు డాక్టర్ నవీన్, ఆర్టీసీ యూనియన్ నాయకుడు చిన్నయ్య, కౌన్సిలర్ వెంకట సుబ్బయ్య, జనసేన పార్టీ నాయకుడు గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యశాల వెటర్నరీ ఆఫీసర్‌కు రాష్ట్రస్థాయి పురస్కారం

సిద్దవటం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాడిరైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలపై రైతులకు అవగాహన కల్పించి నందుకు ముమ్మడిగుంటపల్లె పశువైద్యశాల జూని యర్ వెటర్నరీ ఆఫీసర్ బి.చంద్రకిషోర్‌కు రాష్ట్ర స్థాయి పురస్కారం లభించింది. బుధవారం విజయ వాడలోని పశువైద్యశాలలో సంచాలకులు దామోదర్ నాయుడు చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకు న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంకితభావంతో పనిచేస్తే ఏదైనా సాధించవచ్చని తెలిపారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న వెటర్నరి ఆఫీసర్ చంద్రకిషోర్

సెప్టెంబరు 11, 12 తేదీల్లో కళా ఉత్సవ్

● పోటీలకు 9, 10, 11, 12 తరగతుల విద్యార్థులు అర్హులు
● పోస్టర్ ఆవిష్కరణలో డీఈవో సుబ్రహ్మణ్యం



పోస్టర్ విడుదల చేస్తున్న డీఈవో, ఉపాధ్యాయులు

రాయచోటిటౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లా స్థాయి కళా ఉత్సవ్-2025 పోటీలు సెప్టెంబరు 11, 12వ తేదీల్లో రాయచోటి డైట్ ప్రాంగణంలో నిర్వ హించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధి కారి సుబ్రహ్మణ్యం తెలిపారు. బుధ వారం ఉదయం డైట్‌లో కళాఉత్సవ్-2025 పోస్టర్లను ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాత్ర, వాయిద్య సంగీతం, నృత్యం, నాటకం, దృశ్య క ళలు, సంప్రదాయ కథ చెప్పడం వంటి విభా గాల్లో విద్యార్థుల ప్రతి భను వెలికితీయడం, కళారూపాలను ప్రోత్స హించడమే ఈ పోటీల ప్రధాన ఉద్దేశ్యమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 9, 10, 11, 12 తరగతుల విద్యార్థులు ఈ పోటీలకు అర్హులని ఆయన వివ రించారు. పోటీలను వ్యక్తిగత, బృంద విభాగాల్లో నిర్వహిస్తామ న్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతా మన్నారు. ఈ పోటీలకు సంబంధించిన వివరాల కోసం జిల్లా నోడల్ అధికారి మడితాటి నరసింహారెడ్డి 94402 46825ను సంప్ర దించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డైట్ అధ్యా పకులు తిరుపతి శ్రీనివాస్, శివభాస్కర్, వెంకటసు బ్బారెడ్డి, గిరిబాబుయాదవ్, కేదార్‌నాథ్, శివ ప్రసాద్, కలీముల్లా, మోహన్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

'ఆల్బెండజోల్‌తో ఉల్లాసం.. ఉత్సాహం'

ఒంటమిట్ట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆల్బెండజోల్ మాత్రల వల్ల నులిపురుగులు మరణించి పిల్లలు ఉల్లాసంగా ఉత్సాహంగా ఉంటారని జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి రవిబాబు తెలిపారు. బుధవారం ఒంటి మిట్ట ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్రలతో కడుపులోని నులి పురు గులు మరణిస్తాయన్నారు. దీంతో ప్రజలు తినే ఆహారం శరీరానికి బాగా పడుతుందని, పిల్లలు ఎత్తు, బరువు పెరుగుతారన్నారు. నులిపురుగులు వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలు వివరించారు. కార్యక్ర మంలో వైద్యాధికారులు డాక్టర్ భావన, రమేష్, అరుణజ్యోతి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర, ఆరోగ్య సిబ్బంది నవీన్‌కుమార్, రామ్మూర్తి నాయక్, సునీల్, లక్ష్మీనరసమ్మ, భాస్కర్‌రెడ్డి, ఏఎన్ఎం నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న జిల్లా ఇన్‌చార్జ్ వైద్యాధికారి

విద్యార్థులను దత్తత తీసుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏఎన్‌వో

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 20 (ఆంధ్ర జ్యోతి): చదువులో వెనుకబడిన విద్యార్థులను ప్రతి ఉపాధ్యాయుడు దత్తత తీసుకోవాలని అసిస్టెంట్ అకాడమీ మానిటరింగ్ ఆఫీసర్ పీవీఎన్ కుమార్ తెలిపారు. బుధవారం లక్కిరెడ్డిపల్లెలోని ఏపీ మోడల్ స్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం ఉపాధ్యా యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ 10, ఇంటర్మీడియట్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించా లన్నారు. విద్యాశక్తి మెటీరియల్ అందరికీ అందించారా లేదా అని ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఉపాధ్యా యుడు ప్రభుత్వం అందించిన హ్యాండ్ బుక్స్ ఆధారంగా విద్యార్థులకు బోధించాలన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఎస్ఎంఎం పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. పిల్లల హాజరు శాతం తగ్గకుండా చూడాలన్నారు. ఏఏఎంవో షమీ, ప్రిన్సిపాల్ రమేశ్, అధ్యాప కులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పులివెందుల సబ్‌డివిజన్‌లో...
పోలీసుల కొరత

- గాడి తప్పుతున్న శాంతిభద్రతలు
- పెరుగుతున్న నేరాల సంఖ్య
- ఓ పోలీస్‌స్టేషన్‌లో ఒకే కానిస్టేబుల్

పులివెందుల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పులివెందుల సబ్‌డివిజన్ పరిధిలో పోలీసు సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో శాంతభద్రతలు గాడితప్పుతున్నాయి. పులివెందుల సబ్ డివిజన్ పరిధిలో ఎప్పుడో ఏళ్లకాలం కిందట కేటాయించిన కేటాయింపుల్లోనే 60శాతానికి మించి పోలీసులు అక్కడ విధులు నిర్వహించడం లేదు. ముఖ్యంగా హెడ్‌కానిస్టేబుళ్ల కొరత తీవ్రంగా ఉంది. ఓ పోలీస్‌స్టేషన్‌లో ఒకే ఒక కానిస్టేబుల్ పనిచేస్తున్నారు. పులివెందుల పట్టణంలో రాత్రిళ్లు కేవలం ఒకే ఒక బీట్ ఏర్పాటు చేయడం సిబ్బంది కొరతకు నిదర్శనం. దీంతో ఇటీవల పులివెందులలో క్రైమ్‌రేట్ పెరుగుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు.

పులివెందుల సబ్‌డివిజన్‌లో తొమ్మిది పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. అందులో పులివెందులలో అర్బన్ పోలీస్‌స్టేషన్, వేంపల్లె, ఆర్కేవ్యాలీ, చక్రాయపేట, వేముల, వేంపల్లె, లింగాల, తొండూరు, సింహాద్రిపురం పోలీస్‌స్టేషన్‌లు సబ్‌డివిజన్ పరిధిలో పనిచేస్తున్నాయి. వీటిలో సీఐల నుంచి కానిస్టేబుళ్ల వరకు దాదాపు 229 మంది పనిచేయాల్సి ఉంది. కానీ 143 మంది మాత్రమే ఇక్కడ విధుల్లో ఉన్నారు. మిగిలిన 86 మందికి సంబంధించిన పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్న 143 మంది పోలీసులు ఆయా పోలీస్‌స్టేషన్‌లో విధులు కూడా నిర్వహించడం లేదు. వీరిలో 33 మంది బయట ప్రాంతాల్లో పనిచేస్తున్నారు. కొందరు కోర్టు కానిస్టేబుళ్లుగా, కొందరు ఎస్‌బీ తదితర కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్నారు. దీంతో పులివెందుల సబ్‌డివిజన్ పరధిలో పోలీసుల కొరత ఏ మేరకు ఉందో ఇట్టే అర్థమవుతుంది.

- తొండూరు పోలీస్‌స్టేషన్‌లో ఒకే ఒక్క కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తు న్నారు. ఇక్కడ 11 మంది పోలీసులు విధులు నిర్వహించాల్సి ఉంది. కానీ ఐదుగురు మాత్రం ఇక్కడ ఉన్నట్లు లెక్క. ఆ ఐదుగురిలో నలుగురు బయట ప్రాంతాల్లో పని చేస్తున్నారు. ఇదే పోలీస్‌స్టేషన్‌లో ఒక ఎస్‌ఐ, ఇద్దరు ఏఎస్‌ఐలు ఉన్నారు. అలాగే నలుగురు హెడ్‌కానిస్టేబుళ్ల ఉండాల్సి ఉండగా ఇద్దరు మాత్రమే ఉన్నారు.
- పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్ విషయానికొస్తే 45 మంది కానిస్టేబుళ్ల ఉండాల్సి ఉంది. అందులో 25 మంది మాత్రమే ఇక్కడ పనిచేస్తున్నారు. వీరిలో పదిమంది బయట ప్రాంతాలలో పనిచేస్తున్నారు. అలాగే హెడ్‌కానిస్టేబుళ్ల ఐదుగురికి గాను నలుగురు ఉన్నారు. ఏఎస్‌ఐలు నలుగురికి గాను ముగ్గురు ఉన్నారు. ఇద్దరు ఎస్‌ఐలు, సీఐ ఉన్నారు.
- వేంపల్లెలో ఒక సీఐ, ఇద్దరు ఎస్‌ఐలు ఉన్నారు. ముగ్గురు ఏఎస్‌ఐలు ఉండాల్సి ఉండగా ఇద్దరే ఉన్నారు. 30 మంది కానిస్టేబుళ్ల ఉండాల్సి ఉండగా 17 మంది మాత్రమే ఉన్నారు. అందులో 9 మంది బయటిప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారు.
- చక్రాయపేట పోలీస్‌స్టేషన్‌లో ఆరుగురు హెడ్‌కానిస్టేబుళ్ల ఉండాల్సి ఉండగా నలుగురు మాత్రమే ఉన్నారు. అలాగే 19 మంది కానిస్టేబుళ్లకు గాను 11 మంది ఉన్నారు.
- వేములలో 19 మంది కానిస్టేబుళ్ల ఉండాల్సి ఉండగా 11 మంది ఉన్నారు.
- సింహాద్రిపురం మండలంలో 17 మంది కానిస్టేబుళ్లకు గాను పది మంది ఉన్నారు. పులివెందుల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ విషయానికొస్తే అక్కడున్న సిబ్బందిలో ఒక ఎస్‌ఐ మినహా మిగిలిన సిబ్బంది ఉన్నారు. ఇలా ఎప్పుడో ప్రభుత్వం కేటాయించిన పోలీసుల సంఖ్య ఇప్పటికి కొనసాగుతోంది. ప్రస్తుతం జనాభా పెరిగిన ఆ ప్రాతిపదికన పోలీసులకు కేటాయింపులు లేకపోగా ఎప్పుడో కేటాయించిన కేటాయింపుల ప్రకారం పోలీసు సిబ్బంది లేకపోవడం శాంతిభద్రతలకు విఘతం కలిగిస్తోందని చెప్పవచ్చు. ఇటీవల పులివెందుల పట్టణంలో వరుసగా సంఘటనలు చోటుచేసుకోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. సిబ్బంది కొరత కారణంగానే శాంతిభద్రతలు గాడి తప్పుతు న్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి.

పులివెందులలో ఒక్క బీట్‌తోనే సరి

పులివెందుల పట్టణంలో పోలీసుల గస్తీ అనుక్షణం ఉండాలి. రాత్రి సమయంలో కనీసం మూడు నుంచి నాలుగుబీట్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా కేవలం ఒక బీట్‌తోనే సరిపెడుతున్నారు. దీంతో ఇటీవల ఇటీవల క్రైమ్‌రేట్ క్రమంగా పెరుగుతోందని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ పోలీసు అధికారి అనడం గమనార్హం. పులివెందుల పట్టణంలో గొడవలు, హత్య, కిడ్నాప్ లాంటి వరుస సంఘటనలు చోటుచేసువడం దీనికి బలం చేకూరుస్తోంది.

మహిళ హత్యతో ఉలిక్కిపడ్డ పులివెందుల

పులివెందుల పట్టణం నడిబొడ్డున ఓ మహిళ హత్యతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. అలాగే నాలుగు రోజుల క్రితం పదిరోజుల పసికందును ఓ మహిళ కిడ్నాప్ చేయడం కలకలం రేపింది. ఇక ఇటీవల పలు ప్రాంతాల్లో ఘర్షణలు చోటు చేసుకోవడం, పులివెందుల పట్టణంలో అసాంఘిక కార్యక్రమాలు మట్కా, గ్యాంబ్లింగ్ తదితరవి పెట్రేగిపోతున్నా పోలీసులు అదుపు చేయలేకపోతున్నారనే విమర్శలు లేకపోలేదు.

పోలీసుల వివరాలు కడపలో తెలుసుకోండి

పులివెందుల డివిజన్ పరిధిలో సిబ్బంది కొరత విషయమై డీఎస్పీ మురళీనాయక్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ఆయన ఈ వివరాలు మా వద్ద దొరకవని.. కడప డీపీఓ ఆఫీస్‌లో దొరుకుతాయని, అక్కడ అడగండని.. ఇక్కడ శాంతిభద్రతల వ్యవహారాలే చూస్తామని సెలవిచ్చారు.

'అమ్మ మనసు' కథల సంపుటి ఆవిష్కరణ



కేతు పద్మావతి కథల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కడప కల్చరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సృష్టికి మూలమైన అమ్మ మనసును విశిష్టమైన పంథాలో కేతు పద్మమ్మ అద్భుతంగా ఆవిష్కరించారని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లిఖార్జునరెడ్డి కొనియాడారు. జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సింగపూర్ సిటీలో ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి సతీమణి కేతు పద్మావతి రాసిన అమ్మ మనసు కథల సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. నిరంతరం కుటుంబం నడుపుకోవడంతోనే మహిళల జీవితాలు గడిచిపోతున్నాయని.. అలాంటి పరిస్థితుల్లో రాయలసీమ నుంచి మహిళా కథకులు తయారు కావడం అభినందనీయమన్నారు. కేతు విశ్వనాథరెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ.. ఆమె తన జీవితంలో ఎదురైన అనేక సంఘటనలను కథలుగా రాయడం శుభపరిణామం అన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి రామమునిరెడ్డి, కథా రచయిత పాలగిరి విశ్వప్రసాద్‌రెడ్డి, కేతు విశ్వనాథరెడ్డి కుమారుడు శశికాంత్‌రెడ్డి, జిల్లా రచయితల సంఘం సంయుక్త కార్యదర్శి స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కేతు పద్మావతిని సత్కరించారు.

పెనికెలపాడు చెరువుకు నీటి కోసం పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న ఈఈ ఉమామహేశ్వరరావు

ముద్దనూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెనికెలపాడు చెరువుకు గాలేరు నగిరి కాల్వ నుంచి నీటిని మళ్లించేందుకు బుధవారం జీఎన్ఎస్ఎస్ ఈఈ ఉమామహేశ్వరరావు పరిశీలించారు. కొద్ది రోజుల క్రితం పెనికెలపాడు, రాజుల గురువాయపల్లె, నొస్సంవారిపల్లె, రాఘవాపురం గ్రామాల రైతులు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిని కలిసి సాగు, తాగునీటి కోసం పెనికెలపాడు చెరువుకు నీటిని అందించాలని విన్నవించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు జీఎన్ఎస్ఎస్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు కాల్వ నుంచి గేటు సిస్టమ్ ద్వారా వంక నుంచి నీటిని చెరువుకు తరలించవచ్చని తెలిపారు. ఈ మేరకు అధికారులు స్పందించినట్లు రైతులు తెలిపారు. అలాగే వేల్పుచర్ల చెరువుకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని అందించేందుకు కూడా పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈ సుదర్శన్, మాజీ డీసీసీబీ ఛైర్మన్ కాటమయ్య, రైతులు పాల్గొన్నారు.

ఫిలటరీ స్కాలర్‌షిప్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తపాల బిల్లుల సేకరణ (ఫిలటరీ) అభిరుచిని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం భారత తపాలా శాఖ ద్వారా ప్రవేశపెట్టిన దీన్ దయాల్ స్పర్శ్ యోజన ఫిలటరీ స్కాలర్‌షిప్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రొద్దుటూరు పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ జి.కిరణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతియేటా చదువులో మంచి ప్రతిభ కనపరుస్తూనే ఫిలటరీని అభివృద్ధిగా కొనసాగించే 6, 7 , 8, 9వ తరగతి విద్యార్థులకు సర్కిల్‌స్థాయిలో ఫిలటరీ ప్రాజెక్టు స్పీచ్, పరీక్షల ఆధారంగా స్కాలర్‌షిప్‌లను మంజూరు చేస్తున్న విషయం ప్రజలకు విదితమే. ఇందులో భాగంగానే 2025-26 సంవత్సరానికి గాను దీన్ దయాల్ స్పర్శ్‌యోజన ఫిలటరీ స్కాలర్‌షిప్ పథకం నోటిఫికేషన్‌ను భారత తపాలా శాఖ విడుదల చేసిందన్నారు. పరీక్షలలో అర్హత సాధించి ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.500 చొప్పున సంవత్సరానికి రూ.6 వేలు ఇస్తామని తెలిపారు. ఈనగదును విద్యార్థి తల్లిదండ్రుల ఉమ్మడి ఐపీపీబీ పోస్టల్ ఖాతాలో జమ చేస్తారని, విద్యార్థులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.విజయవాడ పోస్టు.గవర్నమెంట్.ఇన్ వెబ్‌సైట్‌ను వీక్షించవచ్చని, లేదా దగ్గరలోని తపాలా కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

25 తులాల బంగారు ఆభరణాలు చోరీ

ప్రొద్దుటూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం మోక్షగుండం వీధిలో వుండే ఓ బంగారు అభరణాల తయారీ దుకాణంలో బుధవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. వివరాల్లోకి వెళితే మోక్షగుండం వీధిలో మాబూషరీఫ్ బాషా అనే వ్యక్తి తన ఇద్దరి సోదరులతో కలిసి బంగారు అభరణాల తయారీ దుకాణం నిర్వహిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం దుకాణం మూసి భోజనానికి వెళ్లారు. భోజనం చేసి తిరిగి మాబూషరీఫ్ అతని సోదరులు దుకాణంకు రాగానే షట్టర్ పైకి లేపి వుండటం గమనించారు. షట్టర్ తీసి దుకాణంలో వస్తువులు పరిశీలించగా దాదాపు 25 తులాల మేర బంగారు అభరణాలు అపహరణకు గురయినట్లు గుర్తించారు. వెంటనే వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ రామక్రిష్ణారెడ్డి, ఎస్‌ఐలు సంజీవరెడ్డి, శ్రీనివాసులు దొంగతనం జరిగిన బంగారు దుకాణం దగ్గరికి వెళ్లి పరిశీలించారు. కడప నుంచి క్లూస్ టీంను వేలిముద్రల సేకరణ కోసం రప్పించారు. దుకాణంలో యజమానులను విచారించారు. చుట్టుపక్కల గల సీసీ కెమరాలను పరిశీలించగా.. ఓ గుర్తు తెలియని వ్యక్తి బంగారు అభరణాల దుకాణం షెట్టర్ తీసి లోపలికి వెళ్లి వచ్చినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

జమ్మలమడుగు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన మంచాల నవీన్ (22) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. జమ్మలమడుగులోని హరిజన కాలనీకి చెందిన నవీన్ సోమవారం రాత్రి పని నిమిత్తం స్కూటర్‌లో జమ్మలమడుగు-ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డులో వెళుతున్నాడు. అక్కడ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న ప్రదేశంలో ఏర్పాటు చేసిన ఇనుప డ్రమ్ములను వర్షానికి కనపడకపోవడంతో ఢీకొన్నాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స కోసం జమ్మలమడుగుప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రొద్దుటూరుకు, అక్కడి నుంచి కర్నూలుకు తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుని తండ్రి జమ్మలమడుగు పట్టణంలో చెప్పులు కుట్టు కుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇంటికి పెద్ద కుమారుడు మృతితోబోరున విలపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ పోలీసులు తెలిపారు.

స్థల విషయంపై పరస్పర దాడులు

- 20 మందిపై కేసు నమోదు

కాశినాయన, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సావిశెట్టి పల్లెలో బుధవారం ఓస్థల విషయమై ఎంబడి పోలయ్య, ఎంబడి సత్యరాజు అనే ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి గొడవ పడ్డారు. దీంతో ఇరువురికి సంబందించిన వారు రెండు వర్గాలుగా విడిపోయి పరిస్పరం దాడులకు పాల్పడటంతో స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం రెండు వర్గాలవారు ఒకరిపై ఒకరు నర్సాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమేరకు ఎస్‌ఐ యోగేంద్ర పోలయ్యతో పాటు మరో ఆరుగురు, సత్యరాజ్‌తో పాటు మరో 12 మందిపై కేసు నమోదు చేశామన్నారు.

వ్యక్తిపై దాడి... కేసునమోదు

కాశినాయన ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సావిశెట్టిపల్లెకు చెందిన ఎన్.విష్ణుతేజ అనే వ్యక్తిపై వినయ్ అనే యువకుడు అకారణంగా దాడిచేసి గాయపరచడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ యోగేంద్ర తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు... బుధవారం విష్ణుతేజ అనే వ్యక్తి మేకలకు గడ్డికోసం డంపింగ్ యార్డు సమీపంలోకి వెళ్లాడు. అదే సమయంలో ఇటుకులపాడుకు చెందిన రామయ్య తన ఆటోలో పూలకుండీలను గ్రామంలోకి తీసుకొచ్చాడు. ఈపూల కుండీలను ఆటో నుంచి శీను, యువ, వినయ్ అనే ముగ్గురు యువకులు దించే సమయంలో వినయ్ జారవిరచడంతో 4 కుండీలు పగిలిపోయాయి. అపక్కనే పొలంవద్ద ఉన్న విష్ణుతేజ అలా జారవిడస్తే రైతుకు నష్టం కాదా అన్నాడు. దీంతో ఆగ్రహించిన వినయ్ అతనిపై రాయితో దాడి చేసి గాయపరిచాడు. బాధితుడు విష్ణుతేజ ఫిర్యాదు మేరకు వినయ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఘర్షణ - ఇద్దరికి గాయాలు

చాపాడు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమాపురం గ్రామంలో బుధవారం సాయంత్రం రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరు వ్యక్తులు గాయపడినట్లు ఎస్‌ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. ఆయన వివరాల మేరకు... సోమాపురం గ్రామం వద్ద కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మిస్తున్నారు. ఈరోడ్డుకు ఇరువైపుల భూములకు కాలువలు ఏర్పాటు చేయాలని కొంతమంది రైతులు కోరగా.. మరికొందరు వద్దని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పైపులైను ఏర్పాటు చేసే నాలుగు సెంట్ల భూమి విషయమై ఇరువర్గాలు కట్టెలతో ఒకరిపై మరొకరు దాడికి పాల్పడ్డారు. దాడిలో భాస్కర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి అనే ఇద్దరు వ్యక్తుల తల, చేతులకు గాయాలయ్యాయి. పైపులైను ఏర్పాటు చేయాలని ఈనెల 18న కలెక్టర్‌కు గ్రీవెన్‌సెల్‌లో వారు వినతి పత్రం అందజేశారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు తహసీల్దారు రమాకుమారి సాయంత్రం 5 గంటల సమయంలో అక్కడికి వెళ్లారు. ఆ సమయంలో వారు గొడవపడ్డారు. గాయపడిన వారిని ప్రొద్దుటూరులోని జిల్లా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

- ఎస్‌సీ రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ



కడప రైల్వేస్టేషన్‌లో పరిశీలిస్తున్న దక్షిణమధ్య రైల్వే జనరల్‌మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సూచించారు. రైల్వే సిబ్బందికి సమయపాలన తప్పనిసరి అని స్పష్టం చేశారు. బుధవారం తిరుపతి పర్యటనలో భాగంగా ఆయన కడప రైల్వేస్టేషన్‌లో పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించి.. అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించాలన్నారు. ఎటువంటి పొరపాట్లు జరిగినా సహించేది లేదని, సంబంధిత కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గుంతకల్ డివిజన్ అధికారులు, కడప సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించండి

రైల్వే కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కడప బ్రాంచ్ మజ్దూర్ యూనియన్ ప్రతినిధులు జీఎంకు వినతిపత్రం సమర్పించారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని 2వ ప్లాట్‌ఫాం నుంచి రైల్వేకాలనీ వరకు విస్తరించాలని కోరారు. కాలనీలో దాదాపు వంద కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. ప్రధానంగా టీటీఈ గది కార్యాలయం పీడబ్ల్యూఐ కార్యాలయం కూడా అక్కడే ఉన్నాయని చెప్పారు. సిబ్బంది రైలు పట్టాలు దాటాల్సి రావడం వల్ల ఇబ్బందులు, ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. కాలనీ వరకు విస్తరిస్తే రైల్వే కుటుంబాలకు మేలు కలుగుతుందన్నారు. రైల్వే క్వార్టర్స్ నిర్మించాలని, మరికొన్ని సమస్యలను జీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో యూనియన్ కడప బ్రాంచ్ సెక్రటరీ ఎం.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంజీవరాయస్వామి దేవస్థానానికి రూ.50వేలు విరాళం



విరాళం అందజేస్తున్న రిటైర్డ్ ఐపీఎస్ అధికారి

రాజుపాలెం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన చెన్నకేశవ సంజీవరాయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి పదవీ విరమణ పొందిన ఐపీఎస్ అధికారి రవీంద్రబాబు రూ.50వేలు విరాళం అందజేశారు. బుధవారం ఆయన కుటుంబ సమేతంగా సంజీయరాయస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, ఉత్సవ కమిటీ సభ్యులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు స్వామివారి శేష వస్త్రాలు, మెమోంటోలు రవీంద్రబాబుకు అందించి సత్కరించారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ సభ్యులు లక్ష్మినారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డి, సుబ్బిరెడ్డి పాల్గొన్నారు.

మెడికల్ పీజీలో 975వ ర్యాంకు



సీకేదిన్నె, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుసిరెడ్డిపల్లెకు చెందిన గజ్జెల శ్రావణి మెడికల్ పీజీ ఎంట్రెన్స్‌లో 975వ ర్యాంకు సాధించడం పట్ల తల్లిదండ్రులు, బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శ్రావణి కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్‌పూర్తి చేసిందన్నారు. పీజీ ఎంట్రెన్స్ రాయగా జాతీయస్థాయిలో 975వ ర్యాంకు సాధించినట్లు వారు తెలిపారు. తండ్రి ఆంజనేయరెడ్డి హెడ్‌కానిస్టేబుల్‌గా 11వ బెటాలియన్‌లో పనిచేస్తున్నారు.

దివ్యాంగ పింఛన్ల అప్పీళ్లకు అవకాశం

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ పింఛన్ల అప్పీళ్లకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టరు రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. అనర్హులుగా నోటీసు అందుకున్న వారు వికలత్వ పింఛన్లకు తాము అర్హులమని భావిస్తే తమకు సమీపంలోని ఎంపీడీవో, మున్సిపల్ కమిషనరును సంప్రదించి అర్జీలు సమర్పించవచ్చన్నారు. ఆ అర్జీని పరిశీలించి వికలత్వం పింఛను పరిశీలనకు పరిశీలిస్తారన్నారు. వికలత్వ పునఃపరిశీలన చేసేందుకు షెడ్యూలు ప్రకారం అర్జీదారులకు కేటాయించిన తేదీల్లో నిర్దేశించిన ఆసుపత్రిలో హాజరు కావాలని కోరుతూ తదుపరి నోటీసు జారీ చేస్తారన్నారు. వివరాలకు సమీపంలోని గ్రామవార్డు సచివాలయ అధికారులను సంప్రదించాలని సూచించారు.

26న ఐటీఐ అడ్మిషన్లకు గడువు

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ డీఎల్‌పీసీ ఐటీఐలో అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయడానికి ఈ నెల 26న గడువు ఉందని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ అసిస్టెంటు డైరెక్టరు రత్నరాజు ప్రకటనలో తెలిపారు. 26వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, మిషనిస్ట్, మోటరు మెకానిక్, డీజలు మెకానిక్, వెల్డర్ కార్పెంటరు తదితరాలకు ఖాళీగా ఉన్న సీట్లకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆసక్తి గల వారు పాస్‌పోర్టు సైజు గల ఫొటో, తల్లిదండ్రుల ఆధార్ కార్డులతో పాటు విద్యార్థి ఆధార్‌కార్డు కూడా తీసుకుని నేరుగా ఐటీఐ సర్కిల్‌లో ఉన్న ప్రభుత్వ డీఎల్‌పీసీ ఐటీఐ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

పోలీసుస్టేషన్‌కు హాజరైన మాజీ ఎమ్మెల్యే

ఎర్రగుంట్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి ఎర్రగుంట్ల పోలీసు స్టేషన్‌కు హాజరయ్యారు. ఇటీవల పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికకు సంబంధించి ఎంపీ అవినాశ్‌రెడ్డి అరెస్టుకు నిరసనగా పోలీసు వాహనాలను అడ్డుకోవడంతో పాటు ధర్నా నిర్వహించారు. దీనిపై ఎర్రగుంట్ల పోలీసు స్టేషన్‌లో డాక్టర్ సుధీర్‌రెడ్డి, మరికొందరిపై కేసులు నమోదయ్యాయి. దీంతో ఆయన్ను అరెస్టు చేసి స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. ఈ కేసుకు సంబంధించి వాయిదా నిమిత్తం ఆయన బుధవారం ఎస్‌ఐ వద్ద హాజరయ్యారు. ఈ కేసును మళ్లీ 25వ తేదీకి వాయిదా వేస్తూ పోలీసులు నోటీసులు ఇచ్చారు.

టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అందించేందుకు యత్నాలు



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు

ప్రొద్దుటూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా.. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయకుండా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. దీంతో రాష్ట్రమంతటా టిడ్కో ఇల్లు నిరుపయోగంగా ఉన్నాయి. దీనిపై మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఇందులో భాగంగా ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో కొర్రపాడు రోడ్డులో నిర్మించి మధ్యలో ఆపేసిన టిడ్కో గృహాలను కమిషనర్ రవిచంద్రారెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి చంద్రమోహన్‌తో బుధవారం కలిసి పరిశీలించారు. దాదాపు మూడు బ్లాకులలో 144 ప్లాట్లకు స్లాబులు పూర్తయిన దశలో ఉన్నాయని గుర్తించారు. వీటికి అవసరమైన మౌలిక సదపాయాలు కల్పించి లబ్ధిదారులకు అందించే ఏర్పాట్లపై కమిషనర్ సమీక్షించారు. త్వరలో అక్కడ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ప్రజాసేవలో అందరూ భాగస్వామ్యం కావాలి



అన్నదాన కార్యక్రమంలో టీడీపీ నాయకుడు దుర్గాప్రసాద్

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజాసేవలో అందరూ భాగస్వామ్యం కావాలని టీడీపీ నాయకుడు సుధా దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. కడప నగరం ప్రకాష్‌నగర్ జేఎస్‌ఓఎస్ చిల్డ్రన్స్‌హోంలో సినీ నటుడు చిరంజీవి పుట్టినరోజు వారోత్స వాల సేవా కార్యక్రమాలలో భాగంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గణేష్, అంజి, పోలదాసు నాగరాజు, బాలునాయక్, కుమార్‌నాయక్, రాజేష్, గోపాల్‌నాయక్, తరుణ్, రామ్‌చరణ్, హర్షవర్ధన్, మురళి, పవన్, చందు, శివ,చరణ్, పండు, దినేష్, టిల్లు, లడ్డు,నాగార్జున,ప్రణయ్, ఆశ్రమ నిర్వాహకులు సిబ్బంది పాల్గొన్నారు.

బోధనకు దూరం చేసేందుకు పరీక్ష విధానంలో మార్పులు



డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను బోధనకు దూరం చేసేందుకే పరీక్ష విధానంలో మార్పులు చేపట్టి,బుక్‌లెట్ అసెస్‌మెంట్ విధానాన్ని ప్రవేశపెట్టారని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు ఆరోపించారు. బుధవారం డీఈఓ కార్యాలయంలో డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను కలిసి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగాంధ్ర, మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం, శిక్షణ తరగతుల పేరుతో ఉపాధ్యాయులను బోధనకు దూరంచేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్, నాయకులు పాల్గొన్నారు.

'ఎన్నికల కమిషన్‌పై రాహుల్ వ్యాఖ్యలు సరైనవి కావు'

కడప మారుతీనగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్‌పై కాంగ్రెస్‌పార్టీ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలు సరైనవి కావని రిపబ్లికన్‌పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి శివనాగేశ్వర్‌రావు గౌడ్ పేర్కొన్నారు. బుధవారం కడపలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మూడు పర్యాయాలుగా విజయం సాధించిన బీజేపీ ప్రభుత్వ పాలనలో నరేంద్రమోదీ మనదేశాన్ని అభివృద్ధిపథంలో పయనింపజేస్తున్నారని అన్నారు. దీంతో కేంద్రంలో ఎన్‌డీఏ పాలనపై దేశ వ్యాప్తంగా ప్రశంసలు అందుతున్నాయన్నారు. ఇది జీర్ణించుకోలేక కొంతమంది వివిధ పార్టీల నాయకులు సాధారణ ఎన్నికల్లో పలు అక్రమాలకు నరేంద్రమోదీ పాల్పడ్డారని ఆరోపించడం సముచితంగా లేదన్నారు. అలా అక్రమాలకు పాల్పడే ఉంటే దేశ వ్యాప్తంగా బీజేపీ సుమారు 450కి పైగా ఎంపీ సీట్లు గెలిచేదన్నారు. ఈవిషయాన్ని రాహుల్‌గాంధీ తెలుసుకోవాలన్నారు. తక్షణమే ప్రధానికి రాహుల్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు సుబ్బరాయుడు, గిరీష్‌కుమార్, శివారెడ్డి పాల్గొన్నారు.

వినాయక విగ్రహాలకు అనుమతి తప్పనిసరి

కడప క్రైం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పండుగను సంతోషంగా జరుపుకోవాలని వన్‌టౌన్ సీఐ రామక్రిష్ణ అన్నారు. విగ్రహ ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పోలీసులు, విద్యుత్‌శాఖ, కార్పొరేషన్ అధికారుల అనుమతి లేనిదే విగ్రహ ఏర్పాటు చేయరాదన్నారు. మంటపాల వద్ద, ఊరేగింపులో డీజే నిషేధం, మద్యం తాగరాదన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వినాయకుని మంటపాలు కట్టుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తప్పవన్నారు.

సింహాద్రిపురం..: వినాయక చవితి వేడుకలు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ రవికుమార్ సూచించారు. బుధవారం సాయంత్రం సింహాద్రిపురం పోలీస్ స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో వినాయక చవితి సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచనలు ఇచ్చారు. అలాగే వినాయక నిమజ్జన రోజు నిబంధనలు పాటించని కమిటీ సభ్యులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్‌ఐ హెచ్చరించారు. కార్యక్రమంలో హిందూ, ముస్లిం పెద్దలు, కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు బజారులో కుంగిన ఫ్లోరింగ్

కడప రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : నగరంలోని బిజివేముల వీరారెడ్డి రైతుబజారులో ఫ్లోరింగ్ కుంగిపోయింది. ఈ ప్రాంతంలో ఫ్లోరింగ్ టైల్స్ దెబ్బతిని చెల్లాచెరుదుగా ఉన్నాయి. రైతు బజారుకు వచ్చే వినియోగదారులు కుంగిన ఫ్లోరింగ్ వద్ద ప్రమాదాలకు గురి అవుతున్నారు. కొంతకాలంగా ఇలానే ఉండడం వలన ఇబ్బందులకు గురవుతున్నామని వినియోగదారులు వాపోతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదంటున్నారు. ఇటీవల దాదాపు రూ.6 లక్షల రూపాయలతో రైతు బజారులో టైల్స్‌తో ఫ్లోరింగ్‌ను ఏర్పాటుచేశారు. అయితే పనులు నాసిరకంగా చేపట్టడం వలన రైతు బజారులో వినియోగదారులు నడిచే ప్రాంతంలో అక్కడక్కడ ఫ్లోరింగ్ ఆరు నుంచి 12 ఇంచుల వరకు కుంగిపోయింది. రైతు బజారులో ఉదయం పూట రద్దీగా ఉన్నప్పుడు కుంగిన ఫ్లోరింగ్‌ను గమనించని వినియోగదారులు అందులో కాలు వేసి ప్రమాదాలకు లోనవుతున్నారు. కానీ రైతు బజారు అధికారులు కుంగిన ఫ్లోరింగ్ మరమ్మతు పనులను చేపట్టకుండా గాలికి వదిలేశారు. దీంతో వినియోగదారులు రెండు నెలల నుంచి ఇక్కట్లకు లోనవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుంగిన ఫ్లోరింగ్ మరమ్మతు పనులను చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.



రైతు బజారు మధ్యలో కుంగిన ఫ్లోరింగ్

రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ నియామకం చేపట్టాలి

పులివెందుల రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ నియామకం చేపట్టాలని రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు యర్రపురెడ్డి సురేంద్రరెడ్డి రాష్ట్రప్రభుత్వానికి బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. వెంటనే రెడ్డి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు వెంటనే చైర్మన్‌ను నియమించి అవకాశాల కోసం ఎదురుచూస్తున్న రెడ్డి సామాజిక ప్రజలను, రైతులను ఆదుకోవాలని కోరారు.

ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా : సీఐ



టూటౌన్ సీఐ సుబ్బారావు

కడప క్రైం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):ప్రజా సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటానని కడప టూటౌన్ సీఐగా సుబ్బారావు అన్నారు. కడప నగరం టూటౌన్ సీఐగా బుధ వారం ఆయన బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెట్టింగ్, మట్కా, జూదం లాంటి వాటిపై ప్రజలు సమాచారం ఇస్తే వాటిని పూర్తిస్థాయిలో నిర్మూలిస్తామన్నారు.

ఐదు టీఎంసీలకు చేరిన సీబీఆర్ నీటి మట్టం

లింగాల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్నపల్లె సమీపంలో ఉన్న చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్) నీటిమట్టం ఐదు టీఎంసీలకు చేరింది. గండికోట ప్రాజెక్టు నుంచి రెండుమోటార్ల ద్వారా ప్రతి రోజు సుమారు 900 క్యూసెక్కుల మేర నీటిని అధికారులు పంపింగ్ చేస్తున్నారు. వర్షాలు కురవడంతో లింగాల కుడికాల్వకు నీటి విడుదలను ఆపివేయడం జరిగింది. దీంతో ప్రాజెక్టులో నీటిమట్టం వేగంగా పెరిగేందుకు అవకాశం ఏర్పడింది.

వృద్ధాశ్రమంలో అన్నదానం

చెన్నూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పెన్నానది సమీపంలోని పునీత లారెన్స్ వృద్ధాశ్రమంలో చెన్నూరు వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు పి.నిత్యపూజయ్య ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల సురేశ్‌యాదవ్, కొండపేట సర్పంచ్ తుంగ చంద్రయాదవ్, ఎంపీటీసీ నాగిరెడ్డి, కార్తీకరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీక్రిష్ణభగవానుని విగ్రహ ఊరేగింపు



కడప మారుతీనగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీక్రిష్ణాష్టమి సందర్భంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞానవేదిక కడప కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అక్కాయపల్లెలో శ్రీక్రిష్ణభగవానుని విగ్రహ ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 16 నుండి అక్కాయపల్లెలో శ్రీక్రిష్ణభగవానుని ఆలయంలో స్వామివారి ప్రతిమను కొలువుదీర్చి ఐదు రోజులపాటు నిత్యపూజలు చేశారు. చివరిరోజు స్వామివారి ఊరేగింపు , శ్రీక్రిష్ణ కొలువు ప్రాంగణం నుంచి అక్కాయపల్లె, శాస్త్రినగర్, బాలాజీనగర్, కాగితాలపెంట, నబీకోట మీదుగా తి రిగి అక్కాయపల్లెవేదిక వద్దకు చేరుకున్నారు. కమిటీ అధ్యక్షులు నవనీశ్వర్‌రెడ్డి, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకోబోతున్న.. వ్యక్తిని కాపాడిన పోలీసులు

చెన్నూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెన్నా హైలెవల్ వంతెనపై ఆత్మహత్య చేసుకోబోతున్న మాకం వెంకటసుబ్బయ్య అనే వ్యక్తిని చెన్నూరు పోలీసులు కాపాడి కుబంబసభ్యులకు అప్పగించారు. వేముల మండలం చాగలేరు గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య కొద్ది నెలలుగా తీవ్ర అనారోగ్యంలో బాధపడేవాడు. దీంతో కుటుంబసభ్యులకు భారం కాకూడదని నిర్ణయించుకుని చెన్నూరుకి బుధవారం సాయంత్రం చేరుకుని చీకటి పడ్డాక వంతెనపై నుంచి పెన్నాలోకి దూకబోగా స్థానికులు అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని అతనిని స్టేషన్‌కు తీసుకెళ్లి అతనికి కౌన్సిలింగ్ ఇచ్చి వివరాలు అడిగి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

పులివెందుల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ దృక్పథాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ఆర్డీఓ చిన్నయ్య తెలిపారు. బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో జేవీవీ ఆధ్వర్యంలో మూఢవిశ్వాసాల నిరోధక చట్టాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం అమలు చేయాలనే పోస్టర్, కరపత్రాలు, ప్రశ్నించు... ఎందుకని? అనే కరపత్రాన్ని విడుదల చేశారు.జేవీవీ జాతీయ సమాచార కార్యదర్శి సనావుల్లా, పులివెందుల అధ్యక్షుడు యూనస్ తదితరులు పాల్గొన్నారు.

మూఢవిశ్వాసాల వ్యాప్తిని అరికట్టాలి

పులివెందుల రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మూఢ విశ్వాసాల వ్యాప్తిని అరికట్టాలని జాతీయ సమాచార కార్యదర్శి పి.సనావుల్లా పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో జాతీయ శాస్త్రీయ దృక్పథ దినోత్సవంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యాక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.బాల నారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ యు.శ్రీనిత,యునాస్, అధ్యాపకులు శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ ఎస్.సుగుణ, ప్రవళిక విద్యార్థినిలు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాల నిర్మూలన చట్టం చేయాలి

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మూఢ నమ్మకాల నిర్మూలన చట్టం చేయాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.విశ్వనాథ్ కోరారు. బుదవారం కడపనగరం ఎస్టీయూ భవన్‌లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మూఢ నమ్మకాల నిర్మూలన చట్టం అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర సలహా మండలి సభ్యుడు సురేషబాబు తదితరులు పాల్గొన్నారు.

నీటి యాజమాన్యంపై శిక్షణ

చక్రాయపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నీటి యాజమాన్యం విధి విధానాల గురించి బుధవారం మండల కేంద్రమైన చక్రాయపేట వెలుగు కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రతాప్, వెంకటేష్‌లు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఎస్తేర్ రాణి, యూనిట్ ఇన్‌చార్జిలు బేబి, జయచంద్ర, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సాగు రైతులు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి

సీకేదిన్నె, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీచైతన్య హైస్కూలు కె.6 బ్రాంచ్‌లో ఆధార్ స్పెషల్ క్యాంపు ఏర్పాటు చేయడమైందని ఎంఈవో రమాదేవి తెలిపారు. 20వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆధార్‌లో పుట్టినతేదీ, పేరులో మార్పు, వయస్సు, తదితర మార్పులు చేసుకునేందుకు అవకాశమని తెలిపారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు

కడప కలెక్టరేట్,ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో దివంగత దేశ ప్రధానీ రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమం బుధవారం కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు సిరాజుద్దీన్ జిల్లా ప్రధాన కార్యదర్శిసయ్యిద్ గౌస్ పీర్ , ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అలీఖాన్ ఆధ్వర్యంలో కడపలోని ముస్లిం అనాథశరణాలయంలో మైనార్టీ సెల్ అధ్యక్షుడు రహమతుల్లా ఖాన్‌తో కలసి పండ్లుకేక్ పంచిపెట్టారు.కార్యక్రమంలో నేతలు పాల్గొన్నారు.

పాఠశాలల సమీపంలో గుట్కాలు విక్రయించవద్దు

వేంపల్లె, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల సమీపంలో గుట్కా, పాన్‌పరాగ్ వంటివి విక్రయించవద్దని దుకాణదారులను హెచ్చరించారు. సీఐ నరసింహులు ఆధ్వర్యంలో ఎస్‌ఐ తిరుపాల్‌నాయక్, పోలీస్ సిబ్బంది బుధవారం పట్టణంలోని పాఠశాలల సమీపంలోని దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణనిర్వాహకులకు పలుసూచనలు ఇచ్చారు. అలాగే బహిరంగ ప్రదేశాలలో మద్యపానం చేయొద్దని చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మహాధర్నాను విజయవంతం చేయండి

పులివెందుల రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25వ తేదీన విజయవాడలో ధర్నా చౌక్ నందు డీఎస్సీ 2003 టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని 2003 డీఎస్సీ జిల్లా కన్వీనర్ బండి నాగేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద పోస్టర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానవత ర్యాలీని విజయవంతం చేయండి

వేంపల్లె, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో ఈనెల 21వ తేదీ ఉదయం 9గంటలకు నిర్వహించే మానవతాశాంతి ర్యాలీని విజయవంతం చేయాలని చైర్మన్ చక్రపాణిరెడ్డి, అధ్యక్షుడు యోగేశ్వర్‌బాబు, సలహాదారు డాక్టర్ రాజారామ్‌లు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సీఐ నరసింహులుకు వినతిపత్రం అందించారు. ర్యాలీ నిర్వహించుకునేందుకు అనుమతి కోరారు. మానవతావాదులందరూ ఈ ర్యాలీలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేసిన ఘనత రాజీవ్‌దే

వేంపల్లె, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ప్రభుత్వాలను రాజ్యాంగ సవరణ ద్వారా బలోపేతం చేసిన ఘనత స్వర్గీయ ప్రధాని రాజీవ్‌గాంధీదేనని కాంగ్రెస్‌పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించిన ఉదార స్వభావం కలిగిన వ్యక్తి రాజీవ్ అని కొనియాడారు. రాజీవ్‌గాంధీ జయంతి పురస్కరించుకొని వేంపల్లెలో తులసిరెడ్డి ఆధ్వర్యంలో రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కుంచం వెంకట సుబ్బారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి బుధవారం నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, పులివెందుల ఇన్‌చార్జి ధ్రువకుమార్‌రెడ్డి, అమర్‌నాథరెడ్డి, ఉత్తన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సు కోసమే సహకార సంఘం



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసులరెడ్డి

చెన్నూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతుల కోసమే ఉన్నాయని పీఏసీఎస్ చైర్మన్ ముండ్ల శ్రీనివాసులరెడ్డి అన్నారు. బుధవారం పీఏసీఎస్ చైర్మన్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సభ్యులు నీలం గోవిందరెడ్డి, మాకం వెంకటసుబ్బయ్యతో కలిసి బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ మాట్లాడుతూ ఇప్పటి వరకు చెన్నూరు సొసైటీ ద్వారా అందిన రుణాలకన్నా మూడురెట్లు అధికంగా రైతులకు రుణాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనరు విజయ భాస్కర్‌రెడ్డి, రామన శ్రీలక్ష్మి, వేల్పుల సుబ్రహ్మణ్యం, మోహన్‌రెడ్డి, షబ్బీర్‌హుసేన్, సుధాకరరెడ్డి, అల్లాడు రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ పిచ్చయ్య, వెంకటసుబ్బయ్య, కార్యదర్శి గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ సంపద పరిరక్షణ అందరి బాధ్యత

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మన వారసత్వ సంపదను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఇంటాక్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్, కడప చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడప నగరం ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంటాక్ ఆధ్వర్యంలో నేషనల్ హెరిటేజ్ క్విజ్ పోటీ నిర్వహించారు. అనంతరం పోటీలో పాల్గొన్న అందరికీ సర్టిఫికెట్లు బహూకరించారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ చైర్మన్ ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వి.సుదర్శనరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, జోనల్ చైర్మన్ ఎ.వెంకటసుబ్బయ్య, సైకాలజిస్ట్ డాక్టర్ ఓ.వెంకటేశ్వరరెడ్డి, రొటేరియన్ తాజుద్దీన్, ఇంటాక్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి బీజేపీ సహకారం

పులివెందుల రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కొండ అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి బీజేపీ అన్ని విధాలా సహకారం అందిస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకట సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం కదిరిరోడ్డు మార్గంలో నూతనంగా వెలసిన కొండ అభయాంజనేయస్వామిని ఆయన దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు బీరం విద్యాసంస్థల అధినేత సుబ్బారెడ్డి, రాష్ట్ర సాంస్కృతిక విభాగం కన్వీనర్ భానుప్రకాష్, గాలి హరిప్రసాద్, హిందూ జేఏసీ కన్వీనర్ కొప్పల శ్రీనివాస్‌రెడ్డి, లక్షుమయ్య, పవన్‌కుమార్, నవీన్‌కుమార్, వాజ్‌పేయి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

పులివెందుల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కార్మికులు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంక్ పులివెందుల మేనేజర్ మైసూరారెడ్డి సూచించారు. బుధవారం స్థానిక విద్యుత్ కళావేదిక వద్ద విద్యుత్ శాఖ పులివెందుల డీఈ ప్రసాద్‌రెడ్డి, ఏడీఈ గురుమోహన్‌రెడ్డిల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గిడ్డంగివారిపల్లె రిజర్వాయర్ మట్టికట్ట నాణ్యత తనిఖీ



రిజర్వాయర్ మట్టికట్ట నాణ్యతను పరీక్షిస్తున్న అధికార బృందం

వేంపల్లె, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిడ్డంగివారిపల్లె వద్ద గత ప్రభుత్వ హయాంలో నిర్మించతలపెట్టిన రిజర్వాయర్ పనుల్లో భాగంగా జరిగిన మట్టికట్ట నాణ్యతను ఇంజనీరింగ్ అధికారులు పరీక్షించారు. అక్కడ రిజర్వాయర్ నిర్మాణం వల్ల చుట్టుపక్కల గ్రామాలకు తాగు, సాగునీటి అవకాశాలు పెంపొందుతాయని గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ.1100కోట్ల వ్యయంతో రిజర్వాయర్‌ను మంజూరు చేశారు. మొదటగా మట్టికట్ట పనులను చేపట్టారు. సుమారు వంద కోట్లకుపైగా ఖర్చుచేసి మట్టికట్టను నిర్మించారు. ఎంఆర్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ పేరుతో రిజర్వాయర్ పనులు జరిగాయి. ఎన్నికల సమయంలో పనులు నిలిపివేశారు. బిల్లులు పెండింగ్ ఉండడంతో పనులు తిరిగి ప్రారంభించ లేదు. గిడ్డంగివారిపల్లెకు చెందిన టీడీపీ మండల మాజీ కన్వీనర్ మల్లంగి భాస్కర్‌రెడ్డి మట్టికట్ట పనుల్లో అవినీతి, అక్రమాలు జరిగాయని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌లకు పలుమార్లు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు విజయవాడ నుంచి ఇంజనీరింగ్ అధికారులు సాంబశివారెడ్డి, కడప నుంచి ఈఈ రాజశేఖర్, డీఈ వాసుదేవరెడ్డి, ఎంఆర్‌కేఆర్ ప్రతినిధులు సమక్షంలో మట్టికట్ట నాణ్యతను ప్రత్యేక మిషన్లతో పరీక్షించారు. నివేదికను ప్రభుత్వానికి పంపనున్నట్లు అధికారవర్గాల సమాచారం.

దోమలు పుట్టకుండానే జాగ్రత్తలు తీసుకోవాలి



వేంపల్లె ప్రభుత్వ వైద్యశాల వద్ద ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యసిబ్బంది

కడప కలెక్టరేట్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): దోమలు పుట్టకుండా, కుట్టకుండా తగు జాగ్రత్తలు పాటించడంతో మలేరియా, డెంగీ లాంటి వ్యాధులను అరికట్ట వచ్చని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ జమాల్ భాష పేర్కొన్నారు. బుధవారం డీఎంఅండ్ హెచ్‌వో కార్యాలయంలో జిల్లా ఇన్‌చార్జి అధికారి డాక్టర్ రవిబాబు అధ్యక్షత ప్రపంచ దోమల నివారణ దినం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ జమాల్ బాష సర్ రొనాల్డ్ రాస్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. జిల్లా మలేరియా అధికారి మనోరమ, ప్రోగ్రామ్ ఆఫీసరు డాక్టర్ శశిభూషణ్ రెడ్డి, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

సీకేదిన్నె..: దోమల నివారణపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని వైద్యాధికారి రాఘవేంద్ర తెలిపారు. చింతకొమ్మదిన్నెలో బుధవారం ప్రపంచ దోమల నివారణ దినం సందర్భంగా ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో డాక్టర్ సునీత, కవిత, సూపర్‌వైజర్ జనార్దన్, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

వేంపల్లె..: దోమల నివారణకు సమష్టి కృషి అవసరమని వైద్యసిబ్బందితో పాటు ప్రజల్లోచైతన్యం రావాలని తాళ్లపల్లె వైద్యశాల వైద్యాధికారి సుభాషిణి తెలిపారు. ప్రపంచ దోమల నివారణ దినం పురస్కరించుకొని తాళ్లపల్లె ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నిహారిక, శాంతి, సీహెచ్‌ఓ రత్నం, హెచ్‌ఈ షఫిఉన్నీస, ఫకృద్దీన్, సూపర్‌వైజర్ అంకయ్య, ఏఎన్‌ఎమ్‌లు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్..: దోమల పెరుగుదలను అరికట్టేందుకు తమవంతు బాధ్యతగా సహకరించాలని బాకరాపురం యూపీహెచ్‌సీ వైద్యాధి కారి శాంతి కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం ప్రపంచ దోమలనివారణ దినం సందర్భంగా మహాత్మాజ్యోతి బాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో దోమ కాటువల్ల వచ్చే వ్యాధులను వివరించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, ఆశాకార్యకర్తలు సోమ లింగారెడ్డి, ప్రేమలత, ఆశాకార్యకర్త సావిత్ర, స్టాఫ్‌నర్స్ సుష్మ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ

మైదుకూరు రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మైదుకూరులోని కడప రోడ్డులో గురువారం సాయంత్రం ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు టీడీపీ పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు తెలిపారు. బుధవారం స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ విగ్రహావిష్కరణకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ హాజరవుతారని తెలిపారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

మైదుకూరు రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలంటూ ఈనెల 25న విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి గోశెట్టి రామ్మోహన్ పిలుపునిచ్చారు. స్థానిక కడప రోడ్డులోని ఎమ్మార్పీ భవనంలో పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నాగసుబ్బారెడ్డి, పోలిరెడ్డి భాస్కర్, ఆనందరావు, షావలి, సుధాకర్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

కొండాపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక పోలీసుస్టేషన్‌లో శాంతికమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరన్నారు. డీజేలు, రికార్డ్‌డ్యాన్సులు నిషిద్ధమన్నారు.

శాంతియుత సమాజంతోనే ప్రపంచ శాంతి

జమ్మలమడుగు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): శాంతియుత సమాజంతోనే ప్రపంచ శాంతి సాధ్యమని ఆర్డీవో ఆదిమూలం సాయిశ్రీ అన్నారు. బుధవారం పట్టణంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి ర్యాలీ నిర్వహించారు. ముందుగా తాడిపత్రి రోడ్డులోని బాలాజీ హైస్కూలు ఆవరణలో ఆర్డీవో సాయిశ్రీ, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, మానవతా కమిటీ సభ్యులు శాంతి కపోతాలను ఎగురవేశారు. అనంతరం పట్టణంలోని పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండు గాంధీ విగ్రహం వద్ద మానవహారంతో పాటు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సంవత్సరకాలంగా రష్యా, తదితర దేశాల్లో యుద్ధాలు జరుగుతూ శాంతి లేకుండా పోయిందన్నారు. భారతదేశంతో పాటు ఇతర దేశాలు సైతం యుద్ధాలను విడనాడి శాంతిని విస్తరింపజేయాలన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్డీవో సాయిశ్రీ, మానవతా కమిటీ, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి, తదితరులు

కార్యక్రమంలో మానవతా కమిటీ సభ్యులు భైరెడ్డి దీప్తి నిఖిలారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ఎస్‌పీ నాగేశ్వరరెడ్డి, ఓబుళరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫ్లైయాష్ దుమ్మును అరికట్టకపోతే ఆందోళన

ఎర్రగుంట్ల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీ బూడిద చెరువు నుంచి టిప్పర్లతో రవాణా అవుతున్న ఫ్లైయాష్ వల్ల వచ్చే భారీ దుమ్మును అరికట్టకపోతే ఆందోళన చేస్తామని ఆర్టీపీపీ ఉద్యోగులు, కలమల్ల గ్రామస్థులు బుధవారం పోలీసులకు వినతిపత్రాలు అందించారు. యాష్ పాండ్ నుంచి నిత్యం వందలాది టిప్పర్లు, ఇతర వాహనాలు అధిక లోడుతో వెళుతున్నాయని, అలా వెళ్తున్నప్పుడు తడి ఫ్లైయాష్ ను దారి వెంబడి పడుతోందన్నారు. అది దుమ్ముగా మారి తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందన్నారు. తినే అన్నంలో, తాగేనీటిలో పడి కలుషితమవుతోందన్నారు. దుమ్ము నుంచి ప్రజల ప్రాణాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు వి.సుబ్బిరెడ్డి, గిరి, కలమల్ల మాజీ సర్పంచి వి.క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాకు యత్నం

● అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

అట్లూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.వెంకటాపురం రెవెన్యూ పొలంలో సర్వే నెం.60, 61లో 20 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎక్స్‌కవేటర్లు, డోజర్లతో చదును చేసి కబ్జాకు ప్రయత్నించడంతో గ్రామస్థులు తహసీల్దారు సుబ్బలక్ష్మికి బుధవారం ఫిర్యాదు చేశారు. వెంటనే తహసీల్దారు సిబ్బందిని పంపి చదును పనులను అడ్డుకున్నారు. అలాగే భూకబ్జాకు యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ఫిర్యాదులో పేర్కొన్నారు. భూకబ్జాకు యత్నించిన వారితో మాట్లాడడం జరిగిందని, వారికి గతంలో అధికారులు పట్టాలు ఇచ్చారని చెప్పారని తహసీల్దార్ తెలిపారు. పట్టాలు ఉన్నా, మీ దగ్గర ఇంకేం ఆధారాలున్నా తహసీల్దారు కార్యాలయానికి వచ్చి చూపించాలని చెప్పారు. ఎవరైనా ప్రభుత్వభూములు ఆక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

త్వరగా మొక్కలు నాటించాలి

దువ్వూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటే కార్యక్రమం పూర్తి చేయాలని ఎంపీడీవో రామకృష్ణయ్య సూచించారు. దువ్వూరు మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధిహామీ పథకం సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన లక్ష్యం మేరకు పండ్లతోటలు, పూల మొక్కలు, మునగచెట్లు మంజూరైనవారికి గుంతలు తీయించి మొక్కలు నాటాలని తెలిపారు.

పోలీసుల అనుమతి తప్పనిసరి

బద్వేలుటౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో వినాయక ప్రతిమల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని అర్బన్ సీఐ లింగప్ప అన్నారు. బుధవారం ఆయన స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ విగ్రహ ప్రతిష్ఠ, నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులకు సహకరించాలని, పోలీసుల నిబంధనల మేరకు నడుచుకోవాలన్నారు.

వైవీయూ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్శిటీ అభివృద్ధికి రూ.100 కోట్ల నిధులు కేటాయించాలని ఆర్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసుయాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎస్‌సీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి యూనివర్శిటీ అభివృద్ధికి తోడ్పడాలని, యూనివర్శిటీలో నిలిచిపోయిన భవనాలు, ప్రహరీగోడ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఉమర్, ఫరూక్, ఈశ్వర్, శ్రావణి, బాష పాల్గొన్నారు.

మలేరియాపై తగు జాగ్రత్తలు తీసుకోవాలి

ఖాజీపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు యూరియాపై జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ ఇలియారాణి అన్నారు. బుధవారం ప్రపంచ దోమల దినోత్సం సందర్భంగా మండల పరిధిలోని కూనవారిపల్లె, పుల్లూరు, ఉర్దూ పాఠశాలలో అవగాహన కల్పించారు. ఆడ అనాఫిలస్ దోమ కుట్టడం వలన మలేరియా వస్తుందని, దీంతో తీవ్రమైన జ్వరం వస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ముబీనా, ఆరోగ్య విస్తరణాధికారి నాగభూషణం, సూపర్‌వైజర్ కృష్ణప్రియ, శాంతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడం అన్యాయం

కాశినాయన ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లను నిబంధనలకు విరుద్ధంగా తొలగించడం అన్యాయమని ఫీల్డ్ అసిస్టెంట్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాలా శివ, జిల్లా అధ్యక్షుడు గజ్జల సుదర్శన్ అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్‌ల పట్ల ఇటీవల కాలంలో డ్వామా పీడీ వ్యవహరిస్తున్న తీరు చాలా బాధాకరమని, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా తాత్కాలిక నియామకం అంటూ కేవలం ఒక్క కడప జిల్లాలోనే కొత్తవారిని నియమించడం ఆక్షేపనీయమన్నారు. పీడీని ప్రభుత్వానికి సరెండర్ చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో మాజీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు నారిపోగు ఓబయ్య, పాండు, చిన్నవాలి, గురయ్య, పుష్పరాజు, దినకర్‌రెడ్డి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం

కలసపాడు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం సీఎం చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని టీడీపీ యువ నాయకుడు శ్రావణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం కలసపాడులో విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కలసపాడు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపవరంపల్లె గ్రామానికి చెందిన రౌతు పుల్లయ్య నుంచి 9మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తిమోతి తెలిపారు. తన చిల్లర దుకాణంలో పెట్టి వాటిని అమ్ముతుండగా పట్టుకొని సీజ్ చేశామని, ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బ్రహ్మంగారి జిల్లా సాధన సమితి కమిటీ ఏర్పాటు

బద్వేలు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెన్షనర్స్ హోమ్‌లో బుధవారం బ్రహ్మంగారి జిల్లా సాధన సమితి కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి గౌరవాధ్యక్షులు కత్తి బ్రహ్మయ్య, బీసీ రమణ, అధ్యక్షుడిగా దేవిరెడ్డి బ్రహ్మారెడ్డి, కోశాధికారిగా సి.వి.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా పిచ్చయ్య, సహాయ కార్యదర్శులుగా కిరణ్, ఓఎస్‌వి.ప్రసాద్, ఇమ్మానుయేల్, సంయుక్త కార్యదర్శిగా కేశవయ్య, గౌస్‌పీర్, ప్రచార కార్యదర్శి రమేష్ యాదవ్, తదితరులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దళిత, బడుగు, బలహీన వర్గాల మహిళలకు రక్షణ కల్పించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని మాలమహానాడు రామోజీవర్గం జాతీయ అధ్యక్షుడు రామోజీ ఇమ్మానుయేల్ విమర్శించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆముదాల వలసలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ స్థానిక ఎమ్మెల్యే వేధింపులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేపై చర్యలు తీసుకుని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా శాంతిభద్రతలు క్షీణించాయన్నారు. మహిళలపై అత్యాచారాలు కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మురళీప్రసాద్, మేకల ఓబులేసు, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

వరి పంటలో జింకు లోపాన్ని తగ్గించాలి



రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయ శాఖ అధికారి

ఖాజీపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రైతులు వరి పంట సాగు చేసేటప్పుడు దుక్కిలో ఎకరాకు 20 కేజీల జింకును పొలంలో చల్లగలిగితే జింకు లోపాన్ని తగ్గించవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రానాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని బి.కొత్తపల్లెలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు వరి పంటలో ఇష్టానుసారంగా బస్తాలకు బస్తాలు యూరియా వాడుతున్నారని, అలా కాకుండా అధికారుల సూచనల మేరకు వినియోగించాలన్నారు. రైతులు సేంద్రియ వ్యవసాయంవైపు మొగ్గుచూపాలన్నారు. జీవామృతంతో పండించిన పంటలకు మార్కెట్‌లో అధిక రేటు ఉందన్నారు. కార్యక్రమంలో ఏవో నాగార్జున, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బార్ అండ్ రెస్టారెంట్‌కు నోటిఫికేషన్

బద్వేలు, ఆగస్టు 20(ఆంధ్ర జ్యోతి): 2026-28 ఎక్సైజ్ బార్ పాలసీలో భాగంగా బద్వేలు మున్సిపాలిటీలో రెండు బార్ అండ్ రెస్టారెంట్లకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని ఎక్సైజ్ సీఐ బి.సతారామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆసక్తి గలవారు ఈనెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.